# మనం
## ఖమ్మం
## భద్రాద్రి కొత్తగూడెం



www.manamepaper.com గురువారం |15| అక్టోబర్ | 2026 | పేజీలు : 21


## ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల ఏర్పాటు

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అంకిత్

2 లో



# నోటీసుల పంపిణీ, విచారణ పూర్తిచేయాలి

ఖమ్మం కలెక్టర్ దివాకర టిఎస్

1,58,144 మంది ఓటర్ల విచారణ పూర్తి




2 లో

ఫారం-6 పెండింగ్ దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలి

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఎస్ఐఆర్ 2026, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై వివిధ రాజకీయ పార్టీలతో సమీక్షించిన కలెక్టర్



# అట్ల బతుకమ్మ.. ఆశీర్వదించమ్మ

తీరొక్క పూలతో ఆరాధించే పండుగ బతుకమ్మ : కలెక్టర్ దివాకర టిఎస్

ఉత్సాహభరితంగా కలెక్టరేట్‌లో అట్ల బతుకమ్మ వేడుకలు

వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్

2 లో

తీరొక్క పూలతో అలంకరించి పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ మన బతుకమ్మ అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఐదవ రోజు అట్ల బతుకమ్మ సందర్భంగా కలెక్టరేట్‌లోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

# అప్పుల బాధతో.. రైతు ఆత్మహత్య



తూరు బాకలో విషాదం

రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి : నేతల డిమాండ్

19 లో

# 21 నుంచి పోలీస్ అమరవీరుల వారోత్సవాలు



పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు దేశ శాంతిభద్రతలు, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. - ఖమ్మం, అక్టోబర్ 14 (మనం న్యూస్)

20 లో

# నోటీసుల పంపిణీ, విచారణ పూర్తి చేయాలి



**కలెక్టర్ దివాకర టిఎస్**

**1,58,144 మంది ఓటర్ల విచారణ పూర్తి**

**ఫారం-6 పెండింగ్ దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలి**

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**ఎస్ఐఆర్ 2026, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై వివిధ రాజకీయ పార్టీలతో సమీక్షించిన కలెక్టర్**

**ఖమ్మం, అక్టోబర్ 14(మనం బ్యూరో) :** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా పెండింగ్లో ఉన్న నోటీసుల పంపిణీ, విచారణలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతిని ధులతో ఎస్ఐఆర్ కార్యక్రమం, ఎమ్మెల్సీ ఓటరు జాబితా నమోదుపై జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లా డుతూ జిల్లాలో మొత్తం 1,75,841 నోటీసులకు గాను ఇప్పటివరకు 1,630 నోటీసుల పంపిణీ మాత్రమే పెం డింగ్లో ఉన్నాయని 99.07 శాతం నోటీసుల పంపిణీ పూర్తయిందని తెలిపారు. 1,58,144 మందికి విచారణ పూర్తి చేశామని వెల్లడించారు. మిగిలిన విచారణలను నవంబర్ నాటికి పూర్తి చేయాలని, ఓటర్ల నుంచి స్వీకరిం చిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన వారిని ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ఫారం-6 దరఖాస్తులను వచ్చే వారంలోగా పరిష్కరించాలి**

జిల్లాలో ఫారం-6కు సంబంధించి మొత్తం 6,435 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటి పరిష్కారంపై ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను సమీక్షించి వచ్చే వారంలోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. అర్హులైన దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలగకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సూచించారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి:**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో ఇప్పటివరకు జిల్లాలో సుమారు 27 వేల మంది నమోదు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. గతంలో 84 వేల మంది ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. ఈసారి కనీసం 2 లక్షల మంది గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. నవంబర్ 6 ఓటరు నమోదు చివరి తేదీ కావడంతో అర్హులైన గ్రాడ్యుయేట్లందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయాలని అన్నారు.

**మీడియా ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలి:**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, నమోదు ప్రక్రియపై సామాజిక మాధ్యమాలు, పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ ఛానళ్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా అర్హులైన గ్రాడ్యుయేట్లకు అవగాహన కల్పించి, ఓటరు నమోదు ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి.శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, భారత రాష్ట్ర సమితి ప్రతినిధులు బి. వేణుగోపాల్, ఎం. రమేష్, ఏ. సతీష్ బాబు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వి. రాజేష్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి వేల్పుల రామయ్య, సీపీఎం పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 14 (మనంప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, ఈ నెల15 మరియు 16 తేదీ లలో జిల్లాలోని ప్రతి పోలింగ్ స్టేషన్లో ఓటర్ల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడనున్నాయని జిల్లా కలెక్టర్ అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాల సందర్భంగా సంబంధిత బూత్ స్థాయి అధికారులు ( బి ఎల్ ఓలు) తమ తమ పోలింగ్ స్టేషన్లలో ప్రజలకు అందుబాటులో ఉంటారని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమ ఓటు వివరాలు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని కోరారు. ఓటరు జాబితాలో తమ పేరు నమోదు కానివారు ఫారం-6 ద్వారా కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ అంకిత్ తెలిపారు. అదేవిధంగా, 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతీ యువకులు కూడా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ సమీపంలోని పోలింగ్ స్టేషన్లో నిర్వహించే ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకొని, ఓటరు జాబితాలో తమ పేరు నమోదై ఉందో లేదో నిర్ధారించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేసారు.

# తీరొక్క పూలతో ఆరాధించే పండుగ బతుకమ్మ...

**కలెక్టర్ దివాకర టిఎస్**

**ఉత్సాహభరితంగా కలెక్టరేట్ లో అట్ల బతుకమ్మ వేడుకలు**

**కలెక్టరేట్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలలో పాల్గొని గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్**



**ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్) :** తీరొక్క పూలతో అలంకరించి పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ ఆడబిడ్డల పూల పండుగ మన బతుకమ్మ అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లో ఐదవ రోజు అట్ల బతుకమ్మ సందర్భంగా కలెక్టరేట్ లోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ బతుకమ్మ వేడుకలలో కలెక్టరేట్లోని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, ఉద్యానవన శాఖ, జిల్లా విద్యాశాఖ, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, జిల్లా పరిశ్రమల శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, జిల్లా పౌర సంబంధాల శాఖ, సహాయ సంచాలకులు (సర్వే మరియు భూ రికార్డులు), ఉపాధి శాఖ, ఖజానా శాఖ, ముఖ్య ప్రణాళికాధికారి కార్యాలయం, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ కార్యాలయం, జిల్లా సరఫరాల శాఖ, ఎస్డీసి, ఎస్సీ కార్పొరేషన్, గనుల శాఖ, కార్మిక శాఖ, గృహ నిర్మాణ శాఖ, పట్టణ ప్రణాళిక శాఖ తదితర అన్ని శాఖల మహిళా అధికారులు, మహిళా సిబ్బంది అంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. ముందుగా గౌరమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పూలతో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా పూజించారు. అమ్మవారికి కొబ్బరికాయ, ప్రసాదాలు సమర్పించి, జిల్లా సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ బతుకమ్మ ఆట పాటలతో సందడి చేసిన మహిళలు, ఉద్యోగులను కలెక్టర్ ఉత్తేజపరిచారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకుంటున్న బతుకమ్మ పండుగలో తొమ్మిది రోజులు రకరకాలుగా గౌరమ్మను కొలుచుకొంటూ, కలిసి కట్టుగా అందరూ ఒకేచోట చేరి ఆడుతూ, పాడుతూ బతుకమ్మను పూజించుకొంటారని కలెక్టర్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఐడీఓసీ ప్రాంగణంలో వివిధ రకాల రంగురంగుల పుష్పాలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. పూలతో ఆకర్షణీయంగా అలంకరించిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చాయి. మహిళా ఉద్యోగులు భక్తిశ్రద్ధలతో బతుకమ్మకు పూజలు నిర్వహించి, పూలు సమర్పిస్తూ సంప్రదాయాలను పాటించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులు సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ బతుకమ్మల చుట్టూ చేరి ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ ఆడపడుచుల ఐక్యత, ఆత్మీయత, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా వేడుకలు కొనసాగాయి. వివిధ శాఖలకు చెందిన మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. పూల అలంకరణలు, సంప్రదాయ పాటలు, ఆటపాటలతో కలెక్టర్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అందరూ బతుకమ్మ సంబరాలలో పాల్గొని గౌరమ్మను కొలిచి ఆట, పాటలతో సందడి చేసారు.

# 6, 48, 53 డివిజన్లలో బతుకమ్మ వేడుకలు

**పాల్గొన్న సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్**

**ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్):** ఖమ్మం నగరంలోని డివిజన్ 6 ఖానాపురం, 48వ డివిజన్ గణేష్ నగర్, 53వ డివిజన్ ప్రాంతాల్లో డివిజన్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకల్లో ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొని మహిళలు, స్థానిక నాయకులతో కలిసి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. ఖాదర్ బాబా, మాజీ మేయర్ నీరజ, సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ మురళి, పుచ్చకాయల వీరభద్రం, పాలకుర్తి నాగేశ్వరరావు, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షుడు గౌస్, ముఖ్య నాయకులు కిలారి అనిల్, డివిజన్ అధ్యక్షులు చంద్రశేఖర్, అల్లే సాయికిరణ్, శ్రీధర్, డివిజన్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మనం



# ఖమ్మం

ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాథపాలెం

# రైతాంగాన్ని ఆదుకోండి




- జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి
- గోదారి జలాలతో చెరువులు, కుంటలు నింపాలి
- రైతు సంఘం నేత బాగం
- రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

**ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్):** ఎల్నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతులు ఒక్కో ఎకరాకు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టారని ఇప్పుడు పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. దాదాపు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించారు. రైతాంగాన్ని ఆదుకోవాలని గోదావరి జలాలతో చెరువులను నింపాలని, రైతులకు కరువు పరిహారం ఇవ్వాలని నినదించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రాష్ట్రంలో లోటు వర్షపాతం నమోదైన జిల్లాల్లో ఖమ్మం ఒకటని 16 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన తెలిపారు. తక్షణం కరువు ప్రాంతంగా ప్రకటించి ఒక్కో ఎకరానికి పరిహారంగా రూ.30 వేలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు అడుగంటాయని భూగర్భ జల నీటిమట్టం కనిష్ట స్థాయికి చేరుకుంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కనీసం చేతికి అందిన పంటలనైనా కాపాడేందుకు ప్రయత్నం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో పాలేరు రిజర్వాయర్కు గోదావరి జలాలను అందించే ప్రక్రియను తక్షణం పూర్తి చేయాలని ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యమైనంత మేరకు గోదావరి జలాలతో చెరువులు, కుంటలను నింపాలని ఆయన డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రాలు ఇప్పటికే కరువు ప్రాంతాలుగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకునేందుకు చర్యలు చేపట్టాయని కానీ తెలంగాణ ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఆలోచన చేయడం లేదని హేమంతరావు తెలిపారు. యూరియా యాప్ను రద్దు చేయాలని, బహిరంగ మార్కెట్లో యూరియాతో పాటు ఇతర రసాయనిక ఎరువులను విక్రయించాలని ఆయన డిమాండ్ చేశారు. సన్న వడ్లకు సంబంధించి ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం మద్దతు ధరను పెంచాలని హేమంతరావు కోరారు. కౌలు రైతులను గుర్తించి పంటలకు నష్టపరిహారం ఇప్పించాలని ఆయన తెలిపారు. గ్రామస్థాయి నుంచి కరువు ఉపశమన చర్యలు చేపట్టడంతో పాటు పశువులకు మేత సరఫరా చేయాలని వరికి ఎకరాకు రూ.30వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ. 50వేల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల ద్వారా అందించాలని హేమంతరావు కోరారు. ప్రభుత్వం తగు రీతిలో స్పందించక పోతే రైతులను సమీకరించి ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, రైతు సంఘం నాయకులు ఏపూరి లతాదేవి, మిడికంటి వెంకటరెడ్డి, బానోత్ రాంకోటి, వెంకటేశ్వర్లు, స్వర్ణ రమేష్, పావులూరి మల్లికార్జున్, బాగం ప్రసాద్, దొబ్బల వెంగళరావు, వెన్నం భాస్కర్, మామిళ్ల సుదర్శన్రెడ్డి, ఏలూరి భాస్కర్ పాల్గొన్నారు. అనంతరం డిమాండ్స్ కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్కు అందజేశారు.

# వేణు కుటుంబానికి ఐజెయూ నేతల పరామర్శ



**ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్) :** టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్ కుటుంబాన్ని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరహత్ అలీ, కె.రాంనారాయణ పరామర్శించారు. ఇటీవల మాటేటి వేణుగోపాల్ తండ్రి మాటేటి శ్రీరాంరావు మృతిచెందిన విషయం విధితమే. బుధవారం స్థానిక యూనియన్ నాయకులతో కలిసి కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీరాంరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణుగోపాల్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శ్రీరాంరావు మృతిపట్ల తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు రవీంద్ర శేషు, నలజాల వెంకట్రావు, రాజేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, నాయకులు నర్వనేని వెంకట్రావు, వనం వేణుగోపాల్, ఎస్కె మోహినుద్దీన్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామా పురుషోత్తం, మేడి రమేష్, రాయల బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

# అత్యంత వైభవముగా అట్ల బతుకమ్మ వేడుకలు

**ఖమ్మం, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** ఖమ్మం నగరంలో బుధవారం విజయనగర్ కాలనీ 56వ డివిజన్ శ్రీ షిరిడి సాయి బాబా మందిర ప్రాంగణంలో ఐదవరోజు అట్ల బతుకమ్మ వేడుకలను అత్యంత వైభవముగా జరుపుకున్నారు . మహిళందరూ భారీగా తరలి రావడం తో ఆ ప్రాంతం ఆహ్లాదకరంగా మారింది . చిన్న పెద్ద అనే తారతమ్యం లేకుండా అందరూ కలిసి బతుకమ్మ చుట్టూ ఉయ్యాల పాటలతో , చప్పట్లు ఆటలతో , కోలాటాలతో ఆడుకోవడం జరిగింది . అనంతరం ప్రసాద వితరణ , బతుకమ్మల నిమజ్జన కార్యక్రమాలు జరిగాయి . ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .



# కన్నెగంటి వెంకటయ్యకు దాశరథీ సినారె గజల్ కవి పురస్కారం ప్రదానం



**ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్) :** తెలుగు సాహిత్య ప్రక్రియలో విశిష్టమైన గజల్ ప్రక్రియ లో రచనా ,గాన కళలో చేసిన సేవలకు గుర్తింపుగా ప్రముఖ సాహితీవేత్త , గాయకుడు, ప్రధానోపాధ్యాయుడు కన్నెగంటి వెంకటయ్యకు ప్రతిష్టాత్మకమైన " దాశరథీబి సినారె గజల్ కవి పురస్కారం" లభించింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గజల్ గాయకుడు "మాస్ట్రో" డా. గజల్ శ్రీనివాస్ 50 వసంతాల సంగీత ఉత్సవం, 40 వసంతాల తెలుగు గజల్ గాన వేడుకలు, అరవై వసంతాల తెలుగు గజల్కు నీరాజనం మహోత్సవం బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా పరిషత్ రోడ్డులోని భారతీయ విద్యా భవన్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను గజల్ చారిటబుల్ ట్రస్ట్ (ఆంధ్రప్రదేశ్), భారతీయ విద్యా భవన్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సభా వేదిక పై కన్నెగంటి వెంకటయ్య కు, డాక్టర్ గజల్ శ్రీనివాస్, విల్సన్ శరత్ చంద్ర చేతుల మీదుగా శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రం, విశిష్ట పురస్కార జ్ఞాపికను అందజేశారు. తెలుగు గజల్ వైభవాన్ని నలుదిశలా చాటిచెప్పే దిశగా ఆయన చేసిన సాహిత్య కృషిని ఈ సందర్భంగా ప్రముఖులు కొనియాడారు. "తెలుగు గజల్ దిగ్గజాలు కి. శే సి. నారాయణరెడ్డి (సినారె), దాశరథి వంటి మహనీయుల స్ఫూర్తితో సాగుతున్న తన సాహితీ ప్రయాణం లో ఈ పురస్కారం తెలుగు గజల్ రచన పట్ల బాధ్యతను మరింతగా పెంచిందనీ కన్నెగంటి వెంకటయ్య తెలిపారు. ఈ గౌరవాన్ని అందించిన డా. గజల్ శ్రీనివాస్ కి, గజల్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు, ధన్యవాదాలు తెలిపారు.

# హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్లో క్యాన్సర్పై అవగాహన




**ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్) :** హార్వెస్ట్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందికి క్యాన్సర్పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెనోవా హాస్పిటల్స్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోజా కిరణ్ ముఖ్య అతిథిగా హాజైరె క్యాన్సర్పై ఉపాధ్యాయులు, సిబ్బందికి క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన పలు అంశాలను వివరించారు. క్యాన్సర్పై సమాజంలో ఉన్న అపోహలను తొలగించుకోవాలని సూచించారు. శరీరంలో అసాధారణ మార్పులు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని తెలిపారు. వ్యాధి లక్షణాలను ముందుగానే గుర్తించడం, వైద్యుల సూచనల మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ఎంతో ముఖ్యమని, మన శరీరంలో కనిపించే కొన్ని అసాధారణ మార్పులను నిర్లక్ష్యం చేయకూడదు. శరీరంలో ఎక్కడైనా గడ్డలు ఏర్పడటం, కారణం తెలియకుండా బరువు తగ్గడం, అసాధారణ రక్తస్రావం, దీర్ఘకాలంగా తగ్గని పుండ్లు, మింగడంలో ఇబ్బందులు లేదా ఎక్కువకాలం కొనసాగుతున్న దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి. ఈ లక్షణాలు కనిపించినంత మాత్రాన క్యాన్సర్ ఉన్నట్లు కాదని, వాటికి గల కారణాన్ని తెలుసుకోవడం అవసరమని పేర్కొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ పార్వతీరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పును తగ్గించుకోవచ్చని వివరించారు. క్యాన్సర్పై సరైన అవగాహన కలిగి ఉండటంతో పాటు, అవసరమైనప్పుడు వైద్య సలహాలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

# మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం


## బంధంపల్లిలో విద్యుత్ సమస్యపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

- రైతుల విద్యుత్ కష్టాలకు పరిష్కారం చూపండి!
- బంధంపల్లిలో ఒకే ట్రాన్స్‌ఫార్మర్ పై అధిక మోటార్లు.. మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు హామీ



**తిరుమలాయపాలెం అక్టోబర్ 14 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం మండలం లోని బంధంపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయాలతో ఇబ్బందులు ఎదుర్కొం టున్న రైతులకు ఊరటనిచ్చేలా వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. కూసుమంచి వ్యవసాయ డివిజనల్ అధికారి ఈ. రాజేష్ కుమార్, విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు, సయ్యద్ మునీర్ పాషా, లైన్మెన్లతో కలిసి గ్రామంలోని పొలాలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు రేగళ్ల సుదర్శన్ రెడ్డి పొలాన్ని సందర్శించిన అధికారులు విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడ టానికి గల కారణాలను పరిశీలించారు. ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక సంఖ్యలో మోటార్లు ఉండటంతో విద్యుత్ సరఫరాపై భారం పడి మోటర్లు నడవక చాలీచాలని కరెంటుతో పొలాలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన వ్యక్తం చేయడంతో స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వస్తా ఉన్న ట్రాన్స్ఫార్మర్పై అధికలోడు పడుతోందని గుర్తించారు. దీంతో సమస్య పరిష్కారానికి అదనంగా మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను కోరారు.

**యుద్ధప్రాతిపదికన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు**

రైతుల సమస్యలను పరిశీలించిన విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వరరావు స్పందిస్తూ.. బంధంపల్లిలో విద్యుత్ సరఫరా అంతరాయాలను తగ్గించేందుకు యుద్ధప్రాతిపదికన మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి వస్తే మోటార్లపై విద్యుత్ భారం తగ్గి, సరఫరా మెరుగుపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**పంటకు నీరందితేనే రైతుకు భరోసా!...**

ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న రైతులకు పంట అవసరాల సమయంలో విద్యుత్ అంతరాయాలు ఎదురైతే తీవ్ర ఇబ్బందులు తప్పవు. ముఖ్యంగా సాగునీటి కోసం విద్యుత్ మోటార్లపై ఆధారపడే రైతులకు నిరంతర సరఫరా ఎంతో కీలకం. క్షేత్రస్థాయిలో సమస్యను గుర్తించి అధికారులు స్పందించడం పట్ల రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన హామీ మేరకు త్వరితగతిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలాయపాలెం మండల వ్యవసాయ అధికారి నారెడ్డి సీతారాం రెడ్డి , కూసుమంచి వ్యవసాయ డివిజనల్ అధికారి ఈ. రాజేష్ కుమార్, విద్యుత్ శాఖ అధికారులు సయ్యద్ మునీర్ పాషా, లైన్మెన్లు తదితరులు పాల్గొన్నారు.



## సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సంగిశెట్టి యశోదమ్మకు నివాళులు

**పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన తుంబూరు దయాకర్ రెడ్డి**



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని జలగంనగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు సంగిశెట్టి యశోదమ్మ (68) మృతి పట్ల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. యశోదమ్మ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. యశోదమ్మ మృతి పట్ల విచారం వ్యక్తం చేసిన దయాకర్ రెడ్డి, ఆమె కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, వారి బాధలో పాలుపంచుకున్నారు. నివాళులర్పించిన వారిలో సుడా చైర్మన్ పువ్వాడ దుర్గా ప్రసాద్, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బానోత్ కిషోర్ నాయక్, కౌన్సిలర్లు బోయిన కుమారి, సంగయ్య, బానోత్ దివ్య, పుల్చంద్, కాంగ్రెస్ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, వెంకటనారాయణ, బోయిన సాయి తదితరులు పాల్గొన్నారు.

## బాలమ్మ దశదిన కర్మకు హాజరైన తుంబూరు దయాకర్‌రెడ్డి

**కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించిన మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి**



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 14(మనం న్యూస్) :** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండా ఐదో వార్డుకు చెందిన మూడ్ బాలమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాణోత్ కిషోర్ నాయక్, రఘునాథపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేలోత్ దేవ్‌సింగ్, అఖిల భారత బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దరావత్ రామ్మూర్తి నాయక్, కొణిజర్ల మండల మాజీ జెడ్పీటీసీ చిట్టిబాబు, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు మిర్యాల నరుణ్ తేజ్, దేవయ్యచారి, రెబ్బగొండ్ల గోపీ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్ఎల్‌సీ ఓటరు నమోదు వేగవంతం చేయండి

**బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా పార్టీ ఇంచార్జీ బద్దం మహిపాల్ రెడ్డి**



**కూసుమంచి, అక్టోబర్ 14 ( మనం న్యూస్) :** కూసుమంచి మండల కేంద్రంలో జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి విన్నపం మేరకు వారి స్వగృహం కు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి మరియు పార్టీ జిల్లా ఇంచార్జ్ బద్దం మహిపాల్ రెడ్డి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వర రావు మరియు జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రేఖ సత్యనారాయణ యాదవ్ కలసి రావడం జరిగింది. ఈ సందర్భంగా బద్దం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ ఎమ్ ఎల్ సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియ లో పాల్గొని ఓటరు నమోదు చేయించాలని తెలియచేయడం జరిగింది. అదేవిధంగా అనునిత్యం ప్రజా సమస్యలు పరిష్కారం దిశగా పని చేయాలని సూచించడం జరిగింది. అదేవిధంగా పట్టభద్రుల ఎం ఎల్ సి ఓటరు నమోదు సూచనలు ఇవ్వడం జరిగింది. అందరూ మళ్ళీ కొత్తగా నమోదు చేసుకోవాలి, పాత ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు కూడా మళ్ళీ లి ఫారం -18 ద్వారా రీ - ఎన్రోల్ అవ్వాలి అని లేకపోతే 2027 ఎం ఎల్ సి ఎన్నికల్లో ఓటు వేసే అర్హత ఉండదు అని ,2023 లేదా అంతకంటే ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులు అని తెలియ చేశారు. ప్రతి ఒక్క ఓటు విలువైనది అని గతంలో మాదిరి కొద్దిపాటి ఓట్లు గెలుపు, ఓటములు నిర్ణయించే అవకాశం ఉన్నది అని మన పార్టీ త్వరలో జరగబోవు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పార్టీ విజయం సాధించాలి అంటే ప్రతి పట్టభద్రు డిని ఓటరు గా నమోదు చేయించండి అని పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వర రావు తెలియ చేశారు. బీసీ లు ఎక్కువగా ఉన్న ఈ నియోజ కవర్గంలో ప్రతి ఇంటికి వెళ్ళి పారం -18 నింపించండి” - అని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు రేఖ సత్యనారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు చందబోయిన పుణ్యవతి, కొత్త శ్రీనివాస్ రెడ్డి, మంద నవ్య, మంద చంద్రశేఖర్ గౌడ్, సోమనపల్లి వెంకన్న, పిట్టల వేణు తదితరులు పాల్గొన్నారు.





# తిరుమలాయపాలెం ఎస్సైగా పోగుల సురేష్ బాధ్యతల స్వీకరణ



- గంజాయి, పేకాటపై ఉక్కుపాదం.. శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు!

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా పోగుల సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని ఏదూళ్ల బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ మేరకు బుధవారం స్టేషన్‌లో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం మండల పరిధిలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా నూతన ఎస్సై తన విధులను నిర్వహించనున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పోలీస్ శాఖ తరఫున చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు భద్రతా భావం కల్పిస్తూ, చట్టంపై గౌరవం పెంపొందించే దిశగా పోలీసుల సేవలు కీలకంగా నిలవనున్నాయి. గంజాయి, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలపై నిఘా మండల పరిధిలో గంజాయి అక్రమ రవాణా, వినియోగం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇలాంటి కార్యకలాపాలపై నిఘా పెంచి, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు భద్రత కల్పించవచ్చు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు! మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, ప్రజల సహకారంతో శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల ముందున్న ప్రధాన బాధ్యత. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడటం వంటి వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. నూతన ఎస్సై బాధ్యతల స్వీకరణతో తిరుమలాయపాలెం మండలంలో పోలీస్ సేవలు మరింత సమర్థవంతంగా అందుతాయని, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఐలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి



- మెదక్ జిల్లా కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటనపై మండిపడ్డ కాకరవాయి రజక సంఘుశీ నాయకులు

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** కాకరవాయి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మెదక్ పట్టణంలో ధ్వంసం చేసిన దుండగులను వెంటనే గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాకరవాయి రజక సంఘం డిమాండ్ చేసింది. మెదక్ జిల్లాలో జరిగిన ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాసర ఐటీఐ ప్రొఫెసర్ కొత్తపల్లి రాములు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అలాంటి మహనీయురాలి విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని, ఇది ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్య అని అన్నారు. సాక్షాత్తు తెలంగాణ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్యాల ఐలమ్మ లాంటి త్యాగధనుల పోరాటపటిమ మన స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ రాష్ట్రాన్ని సుపరిపాలన అందిస్తున్నామని చెపుతుంటే, ఆకతాయిలు మాత్రం రాష్ట్రంలో పెట్రేగిపోతున్నారు మొన్నటికి మొన్న గాంధీ జయంతి రోజు శుభలేడులో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేయడం మెదక్ లో ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అలా బాధాకరమని రాష్ట్రంలో ఇలాంటి అవామానీయ ఘటనలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని. ఐలమ్మ త్యాగాలను అవమానించే చర్యలను సహించేది లేదని స్పష్టం చేశారు. ఘటనకు పాల్పడిన బాధ్యులను పోలీసులు వెంటనే గుర్తించి, చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వీరనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, ఆమె ఆశయాలను గౌరవిస్తూ విగ్రహాలకు తగిన రక్షణ కల్పించాలని ప్రొఫెసర్ కొత్తపల్లి రాములు కోరారు. కార్యక్రమంలో, కాకరవాయి రజక సంఘం అధ్యక్షులు కొత్తపెల్లి మధు కన్నయ్య, ఉపాధ్యక్షులు దామర్ల సుధాకర్, కోఆర్డినేటర్ కొత్తపల్లి చిన్న రాములు,కొత్తపల్లి రాములు బాసర ఐఐటి ప్రొఫెసర్, కొత్తపల్లి మల్లయ్య, కొత్తపల్లి వెంకన్న, కొత్తపెల్లి మధు , కొత్తపల్లి రవి, కొత్తపల్లి నాగయ్య, కొత్తపల్లి సంజి, ఒక్క నిమిషం కొత్తపల్లి రాములు , కొత్తపల్లి గండయ్య,కొత్తపల్లి లింగయ్య, కొత్తపల్లి మధు కొత్తపల్లి పాపయ్య, కొత్తపల్లి లింగయ్య,కొత్తపల్లి ముత్తయ్య,కొత్తపల్లి వెంకన్న, కొత్తపల్లి శేఖర్,కొత్తపల్లి సైదులు,కొత్తపల్లి మధు, దామర్ల మంగయ్య, కొత్తపల్లి ప్రసాద్, కొత్తపల్లి రాంబాబు, కొత్తపల్లి సంజీ, ధర్మపురి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# 108ను తనిఖీ చేసిన జిల్లా అధికారి ప్రణయ్ కుమార్

- అత్యవసర సమయాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి
- బాధితుల ప్రాణాలను కాపాడటమే లక్ష్యం



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం మండలంలోని 108 అంబులెన్స్‌ను జిల్లా అధికారి ప్రణయ్ కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్‌లో అందుబాటులో ఉన్న అత్యవసర వైద్య పరికరాలు, మందులు, వాటి వినియోగ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులకు ప్రాథమిక చికిత్స అందించే విధానం, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని కాపాడేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై సిబ్బందికి వివరించారు. అత్యవసర సమయాల్లో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా, వేగంగా స్పందిస్తూ బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించాలని సూచించారు. అంబులెన్స్‌లో అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేలా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని, వాటిని అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన అత్యవసర వైద్య సేవలు అందించడంలో 108 అంబులెన్స్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు.

**అత్యవసర పరిస్థితుల్లో 108కు ఫోన్ చేయాలి**

తిరుమలాయపాలెం మండల పరిధిలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా ప్రజలు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని జిల్లా అధికారి ప్రణయ్ కుమార్ సూచించారు. ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు తదితర అత్యవసర సందర్భాల్లో వెంటనే స్పందించి 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఆకస్మిక తనిఖీలో 108 అంబులెన్స్ సిబ్బంది లింగంపల్లి కృష్ణయ్య, మందడి అజయ్, ధర్మసూద్ సక్రు పాల్గొన్నారు.

మనం



## పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

# కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామ సహాయం నరేష్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సుబ్లేడ్‌లో రక్తదాన శిబిరం



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బీరోలు సొసైటీ చైర్మన్, పాలేరు నియోజకవర్గ ప్రజల అభిమానం పొందిన నాయకుడు రామ సహాయం నరేష్ రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం 9.30 గంటలకు రామ సహాయం నరేష్ రెడ్డి ఇంటి ఆవరణలో కేక్ కటింగ్ కార్యక్రమంతో పాటు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ జన్మదిన వేడుకలను సామాజిక బాధ్యతతో జరుపుకోవాలని నిర్వాహకులు నిర్ణయించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు, నరేష్ రెడ్డి అభిమానులు, పార్టీ కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

**ప్రజాసేవే లక్ష్యంగా.. రక్తదానం ప్రాణదానంతో సమానం**

రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని, యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానంలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిస్తున్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని సుబ్లేడ్ సర్పంచ్ సంఘు బత్తుల స్వాతి సుమన్ రెడ్డి పేర్కొన్నారు.

# బచ్చోడు గ్రామంలో లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం..

## కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

## గ్రామ ప్రజల విద్యుత్ కష్టాలు తీర్చేందుకు

## సర్పంచ్ నందిపాటి మల్లికార్జున్ చొరవ



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం మండలం లోని బచ్చోడు గ్రామంలో కొంతకాలంగా వేధిస్తున్న లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించింది. గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో పాటు, తక్కువ వోల్టేజ్ కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన గ్రామ సర్పంచ్ నందిపాటి మల్లికార్జున్ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యను విద్యుత్ శాఖ ఏడీ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సహకారంతో పాటు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపారు. సర్పంచ్ నందిపాటి మల్లికార్జున్ కృషి ఫలితంగా బుధవారం బచ్చోడు గ్రామంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో లో వోల్టేజ్ సమస్య తగ్గి, విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేశారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..**

గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేయడం స్థానిక ప్రజాప్రతినిధుల బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కావడంతో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించనుండటంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి సహకరించిన విద్యుత్ శాఖ అధికారులకు, చొరవ చూపిన సర్పంచ్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంగిరేకుల ఉప్పమ్మ ఉపేందర్ , గ్రామ సహాయకుడు అరవింద్ రెడ్డి, గ్రామ పెద్దలు పల్లె మల్లయ్య, సకినాల యాదగిరి, గొర్రెపాటి రవీందర్, నందిపాటి ఉపేందర్, విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్ భాస్కర్, ఎస్‌ఎల్ఐ, చింతల కృష్ణ, గొర్రెపాటి వెంకన్న, బండారి వీరబాబు, అంగిరేకుల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మనం



# వైరా





## కామేపల్లిలో అలరించిన 'కార్మిక బతుకమ్మ'

**కామేపల్లి అక్టోబర్ 14 (మనం న్యూస్):** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో 'కార్మిక బతుకమ్మ' వేడుకలను , బుధవారం అత్యంత కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకురాలు పి. రమ్య, మండల కన్వీనర్ బాదావత్ శ్రీను మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, వారి పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తున్నాయని ధ్వజమెత్తారు.అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన వర్కర్లకు గౌరవ వేతనం పేరిట వెట్టిచాకిరీ చేయించుకోవడం దారుణమని, తక్షణమే వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని, హెల్త్ కార్డులతో పాటు నాణ్యమైన యూనిఫారాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో సోమలాల్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు కోర్ర నీలా, చీమల పుష్ప, బానోతు అరుణ, ప్రమీల, అహల్య, ముక్తి రామారావు, కొత్తపల్లి ఉపేందర్, రాయల వీరభద్రం, మంగీలాల్, సుమతి, నిర్మల, స్వరూప, కళ్యాణి, జ్యోతి, రావూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలిగించాలి:
### కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు డిమాండ్



**కామేపల్లి అక్టోబర్ 14 (మనం న్యూస్):** ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పేరిట సుమారు 13 కోట్ల మంది అర్హులైన ఓటర్ల పేర్లను గల్లంతు చేస్తూ, ఫారం-6 లో దుస్సాధ్యమైన నిబంధనలతో యువతకు ఓటు హక్కు లేకుండా చేస్తున్న భారత ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవి నుంచి తొలగించాలని కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు డిమాండ్ చేశారు. ఆర్టికల్ 324 ఇచ్చే రాజ్యాంగబద్ధమైన స్థానాన్ని దెబ్బతీస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న సీఈసీపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పది నెలల కాలంలో సహ అధికారులు 14 సార్లు అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోకుండా అధికారులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇటీవల ఈసీఐ విడుదల చేసిన ప్రెస్ నోట్ లో ఫారం-6 సడలింపులను అంగీకరించడమే వారి తప్పునకు నిదర్శనమన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేసి, తొలగించిన ఓటర్లను తిరిగి చేర్చడంతో పాటు ఈ అక్రమాలపై స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## రైతులకు సాగునీరు అందించాలి!

**కారేపల్లి,అక్టోబర్14(మనం న్యూస్):** కారేపల్లి మండల పరిధిలోని పేద రైతులకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు దామాల సత్యం బుధవారం డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.సకాలంలో సాగునీరు అందకపోతే పేద రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న ఎస్సీ కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు.సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు,ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కి కూడా సమాచారం అందించినట్లు దామాల సత్యం తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

### – అధికారులకు జిల్లా కలెక్టర్ దివాకర ఆదేశాలు



**వైరా, అక్టోబర్ 14 (మనం న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర అధికారులను ఆదేశించారు. బుధవారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణతో కలిసి పట్టణంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. టీఎస్‌ఎస్‌డబ్ల్యుఆర్ గురుకుల పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న సమీకృత పాఠశాల భవనాల పనులను పరిశీలించిన కలెక్టర్, పనులు నత్తనడకన సాగడంపై కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ పనులను వెంటనే వేగవంతం చేయాలని, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం కొనసాగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం రింగ్‌రోడ్డు సెంటర్ నుంచి వైరా రిజర్వాయర్‌కు వెళ్లే రహదారిని పరిశీలించారు. రిజర్వాయర్ గుట్టపై పర్యాటక అభివృద్ధికి సంబంధించి రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైన నేపథ్యంలో, అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని రహదారులు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన సమీకృత కూరగాయల మార్కెట్ భవనాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, కమిషనర్ రామచంద్రరావు, ఇతర అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.మున్సిపాలిటీ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పాలకవర్గం, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, డాక్టర్ కాపా మురళీకృష్ణ, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి




**కొణిజర,అక్టోబర్14(మనం న్యూస్):** జాతీయ, రాష్ట్ర చట్టసభ‌లతో పాటు స్థానిక సంస్థల్లోనూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి కొణ ిజర్ల మండల మహాసభ తీర్మానించింది.బుధవారం మండల కేంద్ర ంలోని దొండపాటి వెంకయ్య భవన్‌లో నిర్వహించిన తొలి మం డల మహాసభలో వక్తలు బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు పార్లమెంటులో పటిష్టమైన చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని, బీసీలు విద్యా, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు మేకల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రా బాబు, మండల కార్యదర్శి గడల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.




**నూతన మండల కమిటీ ఎన్నిక...**

సమితి కొణిజర్ల మండల అధ్యక్షుడిగా కంపసాటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా మణిగ కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పిట్టల రాంబాబు, పెదమళ్ల రత్తమయ్య, తండు సోమయ్య, బొడ్డుపల్లి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా డాకూరి బసవయ్య, పెనుగొండ వెంకటేశ్వర్లు, పరిటాల భద్రయ్య, బండారు కిషన్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# ఆధ్యాత్మిక మార్గంలో దుర్గాదేవి పూజలు



**కారేపల్లి, అక్టోబర్14(మనం న్యూస్):** కారేపల్లి మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గల శివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద బుధవారం మహా అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని అన్నపూర్ణాదేవి అలంకరణలో ముస్తాబు చేయగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.మహా అన్నదాన కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు పరిసర ప్రాంత భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండలం లోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల్లోనూ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఆయా మండపాల్లో అమ్మవారిని వివిధ అలంకరణలతో అలంకరించి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వ హించారు.పలువురు దంపతులు పీటలపై కూర్చొని పూజల్లో పాల్గొన్నారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించు కున్నారు.గ్రామాల్లో దుర్గామాత మండపాల వద్ద భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మండల కేంద్రంలోని శివాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మహాన్నదాన కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భీమవరపు శ్రీనివాసరావు, సీనియర్ పాత్రికేయులు అనంతారపు వెంకటాచారి,పాలిక శ్రీను, దమ్మాలపాటి కృష్ణ, ఏపూరి లక్ష్మీనారాయణ,జిట్టబోయిన శ్రీను,పగడాల నాగేశ్వరరావు,తేళ్ల శ్రీనివాసరావు, కొత్తూరి శ్రీనివాస్, ముక్కా వెంకటేశ్వర్లు,బాలు నాయక్, రాము నాయక్, కళ్యాణ్, నరేష్, అశోక్, రాము, సురేష్,శివ తదితరులు పాల్గొన్నారు.

## నేడే పండితాపురంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

**కామేపల్లి, అక్టోబర్ 14 (మనం న్యూస్):** క్యాన్సర్ మహమ్మారిని తొలి దశలోనే గుర్తించి, ప్రజలకు మెరుగైన ఆరోగ్య భద్రత కల్పించే లక్ష్యంతో కామేపల్లి మండలం లోని పండితాపురం గ్రామంలో నేడు ఉదయం 9:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ముత్యాల లాలయ్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ముత్యాల రామయ్య-విమలాదేవి తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రముఖ బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని వివరించారు. బసవతారకం ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం పాల్గొని ప్రజలకు ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పండితాపురం గ్రామం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా గ్రామీణులు ఉదయం 9:00 నుండి సాయంత్రం 4:00 గంటల మధ్య హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రీసర్వే పనులు గడువులోగా పూర్తి చేయాలి

## అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**- సర్వే నిర్వహించే తేదీ, సమయాన్ని రైతులకు ముందుగానే తెలియజేయాలి**

**- రీసర్వే సమయంలో రైతులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలి**

**- లచ్చుగూడెం రెవెన్యూ గ్రామంలో రీసర్వే పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్**



**చింతకాని, అక్టోబర్14(మనం న్యూస్):** జిల్లాలో చేపడుతున్న రీసర్వే పనులను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిర్దేశిత నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహిస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం లచ్చుగూడెం రెవెన్యూ గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే పనులను అదనపు కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రీసర్వే ప్రక్రియ పురోగతిని సమీక్షించి, సర్వే పనులు సక్రమంగా నిర్వహించేలా సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రీసర్వే పనులను నిర్దేశిత మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

# నాగులవంచ గడీ సెంటర్‌లో మహా అన్నదానం..

**- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న చింతకాని ఎస్ఐ జి. నరేష్,**



**చింతకాని, అక్టోబర్ 14( మనం న్యూస్ ):** నాగులవంచ గ్రామంలోని గడీ సెంటర్‌లో మహా అన్నదాన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తి భావంతో చేపట్టిన ఈ అన్నదాన కార్యక్రమంలో భవానీ స్వాములు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి చింతకాని ఎస్ఐ జి. నరేష్, మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి అంబటి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అదేవిధంగా చింతకాని మండల ప్రెస్ క్లబ్ సభ్యులు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు . భవానీ స్వాములు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అన్నదానం మహాదానం.. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మానవత్వానికి నిదర్శనం అనే సందేశాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు యూనిఫామ్‌ల పంపిణీ

**- కార్మికుల సేవలు గ్రామ అభివృద్ధిలో కీలకం**

**- సర్పంచ్ బానోతు జ్యోతి కొండ**




**బోనకల్, అక్టోబర్ 14:(మనం న్యూస్):** బోనకల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచ్ బానోతు జ్యోతి కొండ, పంచాయతీ కార్యదర్శి కోల రాజేశ్వరి ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్మికులకు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోతు జ్యోతి కొండ మాట్లాడుతూ, గ్రామ పరిశుభ్రతను కాపాడటంలో, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడంలో గ్రామపంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచేందుకు కార్మికులు నిత్యం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

# అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో నడిరోడ్లపై విద్యుత్ స్తంభాలు:

## ప్రమాదాల గుప్పిట్లో రాయిగూడెం-గోవింద్రాల రహదారి



**కామేపల్లి అక్టోబర్ 14 ( మనం న్యూస్ ):** విద్యుత్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్య వైఖరి స్థానిక ప్రజల ప్రాణాల మీదకు తెస్తోంది. అధికారులు అండగా నిలవడంతో కాంట్రాక్టర్లు కనీస నియమావళి పాటించకుండా ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలు, సపోర్టింగ్ (స్టే) వైర్లను నడిరోడ్డుకే ఏర్పాటు చేస్తున్నారు. కామేపల్లి మండలంలోని రాయిగూడెం -- గోవింద్రాల గ్రామాల మధ్య ఆర్ అండ్ బి రహదారిపై విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. రహదారిని ఆనుకుని, వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగించేలా సపోర్టింగ్ పోల్లను పాతేశారు. రోజువారీగా ఈ మార్గం గుండా పాఠశాల బస్సులు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు నిత్యం ప్రయాణిస్తుంటాయి. రాత్రివేళల్లో ఈ సపోర్టింగ్ వైర్లు, స్తంభాలు సరిగ్గా కనిపించక వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అధికారుల అలసత్వంతో కాంట్రాక్టర్లు తమకు తోచినట్లు పనులు పూర్తి చేసి వెళ్లడంతో, ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగే వరకు ఎదురుచూడకుండా, విద్యుత్ మరియు ఆర్ అండ్ బి శాఖ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, రహదారిపై ఆటంకంగా ఉన్న స్తంభాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ప్రజలు, వాహనదారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం



# మధిర

మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం చెక్కుల పంపిణీ



**మధిర, అక్టోబర్ 14(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క సహకారంతో మంజూరైన కళ్యాణ లక్ష్మి చెక్కు ను మధిర తహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ రాళ్లబండి రాంబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మధిర మండలం తొండల గోపవరం గ్రామపంచాయతీ పరిధిలో తోర్లపాడు గ్రామానికి చెందిన కాశీబోయిన మహేశ్వరి కి 100116/ రూపాయల చెక్కును మధిర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పారుపల్లి విజయకుమార్ ,మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్ గ్రామ సర్పంచ్ షేక్ కన్నశీసాహెబ్ అందజేశారు. ఈ సందర్భంగా పారుపల్లి విజయ్ కుమార్ మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి షాదీముబారక్ వంటి పథకాలు పేద మధ్యతరగతి కుటుంబాల అప్పుల బాధ నుండి విముక్తి కలిగించుటకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ చెక్కులు రావడానికి కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని తెలిపినారు.

# బస్ సర్వీస్‌ను ఏర్పాటు చేయండి సార్..



**మధిర, అక్టోబర్ 14(మనం న్యూస్):** మధిర మండల పరిధిలోని మల్లారం, రొంపిమల్ల ,జాలిము డి రామచంద్రపురం గ్రామాల మీదుగా నెమలి వైరా వరకు బస్ సర్వీస్ ను ప్రారంభించాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మధిర డిపో సూపర్డెంట్ వారికి వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ మధిర మండలం పరిధిలోని మల్లా రం, రొంపి మల్ల జాలిముడి రామచంద్రపురం గ్రామాలకు బస్ సర్వీస్ లేకపోవడం వల్ల స్కూల్ పిల్లలు కాలేజీ విద్యార్థులు వృద్ధులు మహిళలు ప్రతిరోజు బస్సు సౌకర్యం లేకపోవడం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉదయాన్నే స్కూలుకు కాలేజీలకు వెళ్లవలసిన విద్యార్థులు ఆటోల కోసం గంటలు తరబడి ఎదురుచూడాల్సి వస్తుంది ఆటోలకు అధిక చార్జీలు చెల్లించ లేక చాలామంది ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడింది. అలాగే అనారోగ్యంతో ఉన్న పెద్దలు ఆసుపత్రికి వెళ్లాలంటే కూడా బస్సు లేక నానా అవస్థలు పడుతున్నారు గతం లో బస్ సర్వీసును ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి డిపో ముందు ఆందోళన చేస్తే మల్లారం నెమలి స్థానాల లక్ష్మీపురం మీదుగా వైరాకు ఒక బస్సును పూర్తిస్థాయిలో కేటాయించారు కోవిడ్ తర్వాత ఈ బస్సు రద్దయింది పలుమార్లు డిపో మేనేజర్ తెలియజేసిన బస్ సర్వీస్ ను ప్రారంభించలేదు ఇప్పుడు రోడ్డు డబల్ రోడ్డు పూర్తయింది కావున ఈ పరిసర ప్రాంత ప్రజలకు విద్యార్థులకు రవాణా సౌకర్యం కోసం బస్ సర్వీస్ ను ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ గా డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి సంపసాల సాయి మండల నాయకులు ఏరా నాగులు, వెంకటకృష్ణ, గోపి ,మోహన్ ,క్రాంతి, పాల్గొన్నారు.

# గౌరీ దేవి అవతారంలో అమ్మవారు







**ఎర్రుపాలెం,అక్టోబర్ 14 (మనం న్యూస్):** రామాలయం బనిగండ్లపాడు లో బజారులో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మ వారు గౌరీదేవి అవతారంలో ఘనమైన పూజలు అందు కున్నారు ఈ పూజా జంగా గురునాథరెడ్డి కోన సత్య ంబాబు యన్నం సుధాకర్ రెడ్డి కోన్నా రమేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి క ఠ ం ణా క టా క్ష వ ం ం ల ం పొందియున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికముగా పాల్గొన్నారు.

మనం



# సత్తుపల్లి

సత్తుపల్లి మున్సిపాలిటీ - సత్తుపల్లి మండలం - వేంసూరు - పెనుబల్లి

## వేంసూరును కరువు మండలంగా ప్రకటించాలి

**– కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య**



**వేంసూరు, అక్టోబర్ 14 (మనం న్యూస్):** వేంసూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో నెలకొన్న వ్యవసాయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కరువు మండలంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరినట్లు తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.వేంసూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, అర్హులైన రైతులకు ప్రభుత్వ పరంగా తగిన సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఆయనతోపాటు లింగపాలెం సర్పంచ్ ఎర్ర రమేష్, లచ్చన్న గూడెం సర్పంచ్ చక్రధర్ రావు,దిద్దుపూడి ఉపసర్పంచ్ మోరంపూడి శ్రీధర్ బాబు ,దొడ్డ వెంకటకృష్ణారెడ్డి మండలం ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఎంప్లాయిస్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**పెనుబల్లి అక్టోబర్ 14(మనం న్యూస్ ):** వంగా ముత్యాల బంజర్: గ్రామంలోని ఎంప్లాయిస్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ భూక్య ప్రసాద్, వార్డు సభ్యులు శంకుస్థాపన చేశారు. కొరివిడి సత్య నారాయణ ఇంటి వద్ద నుంచి విజయలక్ష్మి మెడికల్ వెనుక భాగం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు, నిత్యం రాకపోకలు సాగించే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్య ప్రసాద్, తాళ్లూరి రవి, చలమాల సంధ్యారాణి, భూక్య గోమా, బేబీ, రాము పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు వంగా గిరిజాపతిరావు, మేకతోటి కాంతయ్య, మల్లెల శ్రీనివాసరావు, వంగా ఉదయ్, గోగినేని రమేష్, పామర్తి శ్రీనివాసరావు, పెరుమళ్ళ రామారావు, మిట్టపల్లి కిరణ్, గంధం దుర్గయ్య, మోటం రాములు తదితరులు పాల్గొన్నారు.

## తల్లాడ సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ధన్యవాదాలు..

**– వాలీబాల్ క్రీడాకారులు..**



**తల్లాడ, అక్టోబర్ 14 (మనం న్యూస్):** తల్లాడలో వాలీబాల్ క్రీడా మైదానానికి సంబంధించి క్రీడా ప్రాంగణానికి గ్రామపంచాయతీ తీర్మానం ఇస్తామని హామీ ఇచ్చిన తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి లకు తల్లాడ వాలీబాల్ క్రీడాకారులు ధన్యవాదాలు తెలిపారు. వాలీబాల్ క్రీడా మైదానానికి పక్కన చిన్న వాటర్ ట్యాంక్ ఉండటంతో దానిని పగలకొట్టటం జరిగింది. మరలా దానిని యథావిధిగా వాటర్ ట్యాంకు కట్టిస్తామని సర్పంచ్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ క్రీడా ప్రాంగణానికి తొలినుంచి (ఫౌండేషన్ దగ్గరనుండి) ఉన్న చల్లా వెంకట్ కి సర్పంచ్, ఉప సర్పంచ్ ఈ విషయాన్ని తెలియజేశారు. క్రీడాకారులను గుర్తించి ఈ అవకాశం కల్పించినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ధారావత్ కృష్ణ, ఉపేందర్, గ్రౌండ్ ఇంచార్జ్ షేక్ మహారాజ్, మొక్క సైదులు, పెరిక శీను, యాసిన్ పాషా, తోట సంపత్, శివ,అజయ్, శ్రీరామ్ ఉపేందర్, హుస్సేన్,రవితేజ చక్రవర్తి నవీన్, తదితరులు ఉన్నారు.

## కట్టలేరు నదికి గోదావరి జలాలు

**– నాగార్జున సాగర్ ఎడమ కాలువ 88వ కిలోమీటర్ వద్ద కొండ్రుపాడు ఎస్కేప్ నుండి నీరు విడుదల**



**ఎర్రుపాలెం,అక్టోబర్ 13 (మనం న్యూస్):** మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహా రావు. ఎలి నీనో ప్రభావం వల్ల ఎర్రుపాలెం మండలం లోని కట్లేరు ప్రాజెక్టు ఆయకట్టు ఎండిపోకుండా ఉండాలని ఉద్దేశ్యం తో రైతుల విజ్ఞప్తి మేరకు సంబంధిత అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు శీలం శ్రీనివాస్ రెడ్డి,మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొగ్గుల గోవర్ధన్ రెడ్డి,అనుమోలు వెంకట క్రిష్ణారావు, బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి,యరమల వెంకట రెడ్డి,మండల కిసాన్ సెల్ అధ్యక్షులు తలపురెడ్డి నాగిరెడ్డి మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేకలిజానిభాషా తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

**– కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జంతర్ మంతర్ ఉద్యమం: సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు**




**పెనుబల్లి, అక్టోబర్ 14(మనం న్యూస్):** రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ హక్కుల సాధన కోసం ప్రజాస్వామిక శక్తులన్నీ ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. పెనుబల్లిలోని చలమాల సూర్యనారాయణ భవనంలో నల్లమల అరుణ ప్రతాప్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో నున్న నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలు తమ సమస్యలను ప్రశ్నించే హక్కు, అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే హక్కు, శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ప్రజాస్వామ్యానికి పునాదులని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువజనులు, ప్రజాస్వామిక శక్తుల ఆందోళనలను అణిచివేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలే వాటికి భంగం కలిగించేలా వ్యవహ రించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ ప్రజాస్వామ్య నిరసనలకు చారిత్రక వేదికగా నిలుస్తోందని, ప్రజా సమస్యలను దేశవ్యాప్తంగా చర్చకు తీసుకెళ్లడంలో ఉద్యమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్మికుల హక్కులు, రైతుల ప్రయోజనాలు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధి, నిరుద్యోగ యువత సమస్యలు, సామాజిక న్యాయం వంటి కీలక అంశాలపై ప్రజలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సమానత్వం కోసం వామపక్ష, ప్రజాస్వామిక శక్తులు నిరంతరం పోరాటాలు కొనసాగిస్తాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, మాచర్ల భారతి, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు చలమాల విట్టల్ రావు, సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, మండల కమిటీ సభ్యులు చెమట విశ్వనాథం, చిట్టి మొదల కృష్ణయ్య, మిట్టపల్లి నాగమణి, కంద సత్యం, తడికమల చిరంజీవి, భూక్య ప్రసాద్, అప్పారావు, రామచంద్ర, చలమాల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీలకు పని దినాలు, వేతనాలు పెంచాలి

**– వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు**



**బోనకల్: అక్టోబర్ 14 (మనం న్యూస్):** బోనకల్ మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు తెల్లాకుల శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు ఆహ్వానితులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశాలున్నాయని, దీంతో రైతులు వరి సాగును పరిమితంగా చేపట్టారని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో వరి దిగుబడులు తగ్గి బియ్యం ధరలు పెరిగే అవకాశం ఉందని, మరోవైపు వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం కష్టమవుతుందని అన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద పని దినాలను, వేతనాలను పెంచి వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మిక సంఘం మధిర డివిజన్ కార్యదర్శి పాపినేని రామ నరసయ్య మాట్లాడుతూ మండల కమిటీ సభ్యులు గ్రామాల్లో పర్యటించి సన్న, చిన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించాలని సూచించారు. ఆయా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.వ్యవసాయ కార్మిక సంఘం మధిర డివిజన్ అధ్యక్షులు బంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ కరువు పరిస్థితుల నేపథ్యంలో పేద ప్రజలకు అందుతున్న ఉచిత బియ్యం పంపిణీపై కూడా ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల ఆహార భద్రతను కాపాడేందుకు ప్రజలంతా ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బంధం వెంకటరాజ్యం, కొండ నాగేశ్వరరావు, దూబ భద్రాచలం, గద్దె రామారావు, గడ్డికొప్పుల పుల్లయ్య, దొప్ప సంజీవులు, బొబ్బిళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## గౌరీదేవిగా అమ్మవారి అలంకరణ



**చింతకాని, అక్టోబర్ 14( మనం న్యూస్):** దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాగులవంచ శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో నాలుగో రోజు అమ్మవారు గౌరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి పూజలు అందుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మ వారి ఆశీస్సులు పొందా రు. నవరాత్రి ఉత్సవాల తో ఆలయంలో ఆధ్యాత్మి క వాతావరణం నెలకొంది.

# రేపు నూతనకల్లులో శ్రీ శివగిరి మణికంఠ ప్రతిష్ట మహోత్సవం..

**– సకల సౌకర్యాలు కల్పించిన నిర్వాహకులు..**

**తల్లాడ, అక్టోబర్ 14 (మనం న్యూస్):** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం నూతనకల్లు గ్రామ శివారు లో అందమైన పచ్చని పొలాలు మధ్యలో నూతనంగా అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మించి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నా శ్రీ శివగిరి మణికంఠ పుణ్యక్షేత్రంలి ప్రతిష్ట మహోత్సవం 16న ఉదయం 8.43 నిమిషాలకు గణపతి స్వామి సుబ్రహ్మణ్య స్వామి స్పటిక లింగ లింగేశ్వరుడు లలితా దేవి, మాలికా పురోత్తమ్మ ద్వారపాలకులు నవగ్రహాలు ధ్వజారోహణ లను దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త అధ్యక్షులు సత్తెనపల్లి యాదగిరి నాగ బ్రహ్మాచార్యులు (గిరి) ఆధ్వర్య ంలో వారిచే వేద పండితులు ప్రతిష్టోచార్యులు రామడుగు నరసింహాచార్యులు, రామడుగు విక్రమాచార్యులు, సోము నరేష్ ఆచార్యులు, మోతుకూరి ఫణింద్రచార్యులు, వారి మిత్రబృందం వేద మంత్రో చంఇలతో జరుగును. 15నా ఉదయం అభిషేకాలు, సాయ ంత్రం అయ్యప్ప స్వాములు భక్తుల చే గ్రామంలో నగర సంకీర్తనలి ప్రతిష్ట విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం,16న అయ్యప్ప స్వామి పరివార దేవతల ప్రతిష్ట మహోత్సవంలి స్వామియే శరణమయ్యప్ప అంటూ ప్రతిష్ట మహోత్సవం నిర్వహిస్తున్నామని ఇట్టి కార్యక్రమానికి వేలాది మంది అయ్యప్ప మాలదారులు, భవానీ మాలదారులు, శివ మాల దా రులు, పలువురు మాలదారులు మ రియు పరిసర ప్రాంత భక్తులు పాల్గొని స్వామివారి దివ్య దర్శనం చేసుకుని అన్న మహా ప్రసాదం స్వీ కరించి శ్రీ శివగిరి మణికంఠ క్షేత్రం పుణ్యక్షేత్రంగా వర్ధిల్లాలని ఆలయ చైర్మన్ రమణారెడ్డి కోరారు.





# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం

**కల్లూరు టౌన్ అక్టోబర్ 14(మనం న్యూస్):** ఖమ్మం జిల్లా, కల్లూరు మండలంలోని రైతు వేదికనందు రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఫణి శ్రీ మరియు మండల వ్యవసాయ అధికారి కల్లూరు పాల్గొని రైతులకు ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త ఫణి శ్రీ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, రసాయన ఎరువులు మరియు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం, జీవ ఎరువుల వినియోగం, జీవామృతం, ఘన జీవామృతం తయారీ మరియు వినియోగం, నేల ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సమతుల్యత వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని వివరించారు.మండల వ్యవసాయ అధికారి కల్లూరు మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరణలో పెట్టాలని, పంటల్లో సమతుల్య పోషక యాజమాన్యాన్ని పాటించాలని, రసాయన ఎరువులు మరియు పురుగుమందులను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో అందుబాటులో ఉన్న సహజ వనరులను వినియోగించుకుంటూ స్థిరమైన వ్యవసాయ పద్ధతుల వైపు అడుగులు వేయాలని తెలిపారు.ఈ శిక్షణ కార్యక్రమంలో రైతులు పాల్గొని ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. వ్యవసాయ అధికారులు రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలు అందించారు.





# 17వ వార్డులో రూ.44.50 లక్షలతో అభివృద్ధి

**– 350 మీటర్ల సీసీ రోడ్లు,**
**450 మీటర్ల డ్రైనేజీ నిర్మాణం**
**– ప్రజావసరాలను గుర్తించి అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి**
**– కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజకుమార్**

**కల్లూరు అక్టోబర్ 14 (మనం న్యూస్):** మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో రూ.44.50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 17వ వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన నిధులతో 350 మీటర్ల పొడవున సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు 450 మీటర్ల డ్రైనేజీ నిర్మాణ పనులకు నిధులు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆమె సూచించారు. మౌలిక సదుపాయాల మెరుగుదలతో వార్డులో ప్రజలకు మరింత సౌకర్యవంతమైన జీవన పరిస్థితులు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. వార్డులోని ప్రతి సమస్యను గుర్తించి అధికారుల సహకారంతో పనిచేస్తానని తెలిపారు.



మనం
జనం కోసం అక్షర యజ్ఞం




# కల్లూరు

కల్లూరు మున్సిపాలిటీ - కల్లూరు మండలం - తల్లాడ

## ప్రారంభానికి సిద్ధంగా రేజర్ల గ్రామ మహిళా సంఘ కార్యాలయం..

**– పరిశీలించిన ఉప సర్పంచ్ చలపతిరావు..**

**తల్లాడ, అక్టోబర్ 14 (మనం న్యూస్):** తల్లాడ మండలం పరిధిలోని అంజ నాపురం (రేజర్ల) గ్రామ సమైక్య కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైం ది. విబిజి రాంజీ పథకం కింద ఈ కార్యాలయానికి 10 లక్షల రూపా యలు నిధులు మంజూరయ్యారు. ఈ కార్యాలయాన్ని గ్రామ సర్పంచ్ నల్లగొర్ల రాధా, ఉప సర్పంచ్ కేతినేని చలపతిరావు ఆధ్వర్యంలో పూర్తి అయింది. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం పక్కనే ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. పనులు పూర్తి కావడంతో పాటు కార్యాలయానికి రంగులు వేశారు. మరో రెండు మూడు రోజుల్లో కార్యాల యం ప్రారంభానికి రెడీగా ఉంది. బుధవారం ఆ కార్యాలయాన్ని ఉప సర్పంచ్ కేతినేని చల పతిరావు కార్యదర్శి వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్యాల యాన్ని త్వరతగిన పూర్తి చేసామని, త్వరలోనే ప్రారంభ తేదీని ప్రకటిస్తామని తెలిపారు.




## బోరున విలపించిన వాణి కుటుంబసభ్యులు..

**– చిన్నారి కూతుళ్లను చూసి కంటతడి..**

**తల్లాడ, అక్టోబర్ 14 (మనం న్యూస్):** రెండు రోజుల క్రితం పాము కాటుకు గురై మృతి చెందిన తల్లాడ మండలంలో ని తెలగవరం గ్రామానికి చెం దిన తేల్లూరి వాణి మృతదేహా న్ని బుధవారం గ్రామానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా తమతో పాటు పనికి వచ్చి ఒక్కసారిగా విగతజీవిగా కనిపించిన ఆమెను చూసిన కుటుంబ సభ్యులు, తోటి కూలీలు బోరున విలపించారు. అంతేకాకుండా ఆమెకు ముగ్గురు చిన్నారి కూతుళ్ల ఉండటంతో వారు తల్లిని చూసి బోరు బోరునా కన్నింటి పర్వంతమయ్యారు. వారు ఏడుస్తున్న తీరు పలువురుని కంటతడి పెట్టించింది. అసలే నిరుపేద కుటుంబం ఆపై పెద్దదిక్కుగా ఉన్న తల్లి కూడా లేకపోవడంతో చిన్నారుల జీవితం ఏమవుతుందని పలువురు చర్చించుకోవడం గమనార్హం. అనంతరం యధావిధిగా ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.



## పినపాక సర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు..



**తల్లాడ, అక్టోబర్ 14 (మనం న్యూస్):** తల్లాడ మండలంలోని పాత పినపాక గ్రామంలో గ్రామ సర్పంచ్ గుర్రం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబ రాలు బుధవారం రాత్రి వైభవ ంగా జరిగాయి. ఈ సందర్భ ంగా సర్పంచ్ సతీమణి కవిత, ఉప సర్పంచ్ స్వరూప రాణి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాళ్ల త్రివేణి, తోటకూర కృష్ణకుమారి, దూదిపాల్ల భారతమ్మ తదితరు లు మహిళలతో కోలాటం ఆడారు. గ్రామంలోని పలుచోట్ల ఆడిన బతుకమ్మ వేడుకల్లో సర్పంచ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మహిళలు ఆటల, పాటలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ నర్వనేని లక్ష్మి, నర్వనేని కుమారి, రేణుక, చిలకమ్మ, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, వసంత, కళావతి, మమత, తదితరులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం

# కొత్తగూడెం

కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి

## బోనస్ లో తీరని అన్యాయం



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 14(మనం న్యూస్):** సింగరేణి కార్మికులకు వాస్తవ లాభాల ఆధారంగా న్యాయమైన బోనస్ ప్రకటించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర నాయకులు డి.వీరన్న విమర్శించారు. బుధవారం కొత్తగూడెం పట్టణంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సంస్థ లాభాల్లో కార్మికుల శ్రమకు తగిన వాటా కల్పించి న్యాయమైన బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను కూడా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని అన్నారు. గతంలో ఇచ్చిన రూ.5,500 మాత్రమే చెల్లించి చేతులు దులుపుకోవడం కాంట్రాక్ట్ కార్మికులకు తీరని అన్యాయమని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, న్యాయమైన ప్రయోజనాల కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డి.వీరన్న విజ్ఞప్తి చేశారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం ఎక్కడి వరకు?

### - ఫిర్యాదుల సంఖ్య.. పరిష్కారాలపై నోటీసు బోర్డులో వివరాలు పెట్టాలని ప్రజల డిమాండ్



**సుజాతనగర్, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** ప్రజల సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంపై ప్రజల్లో ఆసక్తితో పాటు పలు ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు అధికారులకు ఫిర్యాదుల రూపంలో అందజేస్తున్నారు. అయితే ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన అనంతరం ఆ సమస్య పరిష్కారం ఏ దశలో ఉంది? సంబంధిత శాఖకు ఎప్పుడు పంపించారు? ఇప్పటివరకు ఎన్ని ఫిర్యాదులు పరిష్కరించారు? ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? అనే వివరాలు ప్రజలకు స్పష్టంగా తెలియడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులపై అధికారులు రికార్డు నిర్వహిస్తున్నప్పటికీ, ఆ రికార్డు ఆధారంగా ప్రజలకు సమాచారం అందించే విధానం మరింత పారదర్శకంగా ఉండాలని పలువురు కోరుతున్నారు. ప్రజావాణిలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఒకే చోట అందుబాటులో ఉండటం వల్ల ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు వివరించే అవకాశం కలుగుతోంది. అయితే ఫిర్యాదులు స్వీకరించడంతోనే కార్యక్రమం ముగియకుండా, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను కూడా ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

**నోటీసు బోర్డులో వివరాలు ఉంచాలి :** ప్రతి వారం నిర్వహించే ప్రజావాణిలో ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. వాటిలో ఎన్ని పరిష్కరించారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి.. ఏ శాఖ వద్ద ఎన్ని ఫిర్యాదులు ఉన్నాయి అనే వివరాలను మండల పరిషత్ కార్యాలయం (ఎంపీడీవో కార్యాలయం) వద్ద ప్రత్యేక నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ప్రజలు కోరుతున్నారు. దీనివల్ల ప్రజావాణి కార్యక్రమంపై మరింత నమ్మకం పెరగడంతో పాటు అధికారుల పనితీరులో పారదర్శకత ఏర్పడుతుందని అభిప్రాయపడుతున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజావాణి కేవలం ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమంగా కాకుండా, ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపే బాధ్యతాయుత వ్యవస్థగా కొనసాగాలని ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదుల పరిష్కారంపై వారానికోసారి వివరాలు వెల్లడిస్తే కార్యక్రమం ఎంతవరకు ఫలప్రదంగా కొనసాగుతుందో ప్రజలకు కూడా స్పష్టత వస్తుందని అంటున్నారు. లేకపోతే ఫిర్యాదులు స్వీకరించడం, రికార్డుల్లో నమోదు చేయడం వరకే పరిమితమై ప్రజావాణి "తూతూమంత్రంగా" మారుతోందా? అనే సందేహాలు ప్రజల్లో తలెత్తే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రజావాణి లక్ష్యం నెరవేరాలంటే ఫిర్యాదుల స్వీకరణతో పాటు వాటి పరిష్కారం, పురోగతి వివరాలను కూడా బహిరంగంగా వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రీడాకారుల సత్తా

### - అండర్-14 ఛాంపియన్‌షిప్‌లో తొమ్మిది పతకాలు కైవసం.. క్రీడాకారులకు అభినందనల వెల్లువ



**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 14 (మనం న్యూస్):** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో తమ ప్రత్యర్థులతో హోరాహోరీగా తలపడి మొత్తం తొమ్మిది పతకాలు సాధించి ఉమ్మడి జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన బాలబాలికలు ఆత్మవిశ్వాసంతో పోటీపడి ప్రతిభను చాటుకున్నారు. కఠోర సాధన, పట్టుదలతో పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**బాలుర విభాగంలో పతకాల విజేతలు**

అండర్-14 బాలుర విభాగంలో సున్నిత్ జట్, అభిరామ్ రజత పతకాలు సాధించగా, అఖిల్, నిహార్, హేమచంద్ర కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం ద్వారా తమ క్రీడా నైపుణ్యాన్ని నిరూపించుకున్నారు.

**బాలికల విభాగంలోనూ మెరుగైన ప్రతిభ**

బాలికల విభాగంలో ఎస్.కె. హనీఫా, ప్రసన్న, ప్రవీణ లక్ష్మీ ప్రసన్న రజత పతకాలు సాధించారు. మానస కాంస్య పతకాన్ని గెలుచుకుంది. బాలికలు కూడా అద్భుత ప్రదర్శనతో పతకాలు సాధించి జిల్లా క్రీడా రంగానికి గుర్తింపు తీసుకొచ్చారు.

**కోచ్‌ల పర్యవేక్షణలో విజయాలు**

జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. కాశీ హుస్సేన్ పర్యవేక్షణలో, ఎస్. వినయ్, వై. జంపన్న కోచ్‌లుగా వ్యవహరించారు. వీరి మార్గదర్శకత్వంలో క్రీడాకారులు సాధన చేస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం విశేషం.

**క్రీడాకారులకు అభినందనలు**

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లాల డీవైఎస్‌ఓలు, డీఈవోలు, పాఠశాలల క్రీడా కార్యదర్శులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎంలు), పీడీలు, పీఈటీలు, పలువురు క్రీడాభిమానులు అభినందించారు. భవిష్యత్తులోనూ క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా క్రీడాకారులు తొమ్మిది పతకాలు సాధించడం జిల్లా క్రీడా రంగానికి గర్వకారణమని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. కాశీ హుస్సేన్ పేర్కొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో వసూళ్ల దందా ఆరోపణలు!

### - భక్తులు సమర్పించే కానుకలు అమ్మవారికి చేరుతున్నాయా
### - పూజల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారంటూ స్థానికుల ఆవేదన.. ఆలయ నిర్వహణపై విచారణ జరపాలని డిమాండ్





**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 14 (మనం న్యూస్):** భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలవాల్సిన దేవాలయాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయాల్సి ఉండగా, కొత్తగూడెంలోని బాబు క్యాంప్ గల శ్రీ కనకదుర్గ అమ్మవారి మందిరం నిర్వహణపై స్థానిక ప్రజలు పలు ఆరోపణలు చేస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పూజారి వ్యవహారశైలిపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, అమ్మవారి పేరుతో నిర్వహించే పూజా కార్యక్రమాలకు సంబంధించి వసూళ్లు, ఖర్చుల వివరాలను బహిరంగంగా వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

**భక్తులు సమర్పించే కానుకలు ఏమవుతున్నాయి?**

అమ్మవారిపై భక్తితో భక్తులు సమర్పించే వస్తువులు, కానుకలు సక్రమంగా అమ్మవారికి చేరడం లేదని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. భక్తులు సమర్పించే కానుకల నిర్వహణలో పారదర్శకత కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తులు సమర్పించే వస్తువులు, విరాళాలకు సంబంధించిన వివరాలను నమోదు చేస్తున్నారా? వాటిని ఏ విధంగా వినియోగిస్తున్నారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

**ప్రతి కార్యక్రమానికీ ప్రత్యేకంగా డబ్బుల వసూలా?**

ఆలయంలో నిర్వహించే ప్రతి కార్యక్రమానికి ఒక నిర్దిష్ట మొత్తాన్ని వసూలు చేస్తున్నారని, అయితే అందుకు తగిన విధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భక్తుల నుంచి డబ్బులు సేకరించినప్పుడు వాటి వినియోగానికి సంబంధించిన లెక్కలు కూడా స్పష్టంగా ఉండాలని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, ఇతర ధార్మిక కార్యక్రమాల పేరుతో భక్తుల నుంచి సేకరిస్తున్న మొత్తాలు ఎంత? వాటిని ఏయే అవసరాలకు ఖర్చు చేస్తున్నారు? అనే వివరాలను ఆలయ నిర్వాహకులు వెల్లడించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**-శరన్నవరాత్రులు పేరుతో లక్షలాది రూపాయల వసూళ్లా? :** శివనవరాత్రుల సందర్భంగా లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నప్పటికీ, భక్తులు ఆశించిన స్థాయిలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉత్సవాల పేరుతో విరాళాలు సేకరించినప్పుడు, వాటికి సంబంధించిన ఖర్చుల వివరాలను భక్తులకు తెలియజేయాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందని వారు పేర్కొంటున్నారు. భక్తుల నుంచి విరాళాలు సేకరించడం తప్పు కాదని, అయితే ఆ విరాళాలను ఏ విధంగా వినియోగిస్తున్నారు, ఉత్సవాలకు ఎంత ఖర్చు చేస్తున్నారు, మిగిలిన మొత్తాన్ని ఎలా నిర్వహిస్తున్నారు అనే అంశాలపై స్పష్టమైన లెక్కలు ఉండాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే, వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు, పూజా కార్యక్రమాల నిర్వహణపై వస్తున్న విమర్శల వాస్తవాలను సంబంధిత ఆధారాలతో పరిశీలించాల్సి ఉంది.

**మందిర నిర్మాణానికి వసూలు చేసిన నిధుల లెక్కలేవి?**

ఆలయ నిర్మాణం కోసం స్థానిక ప్రజల నుంచి డబ్బులు సేకరించినప్పటికీ, మందిర నిర్మాణం పూర్తిస్థాయిలో జరగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణం కోసం సేకరించిన విరాళాలు ఎంత? ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు? ఇంకా ఎలాంటి పనులు మిగిలి ఉన్నాయి? అనే వివరాలను వెల్లడించాలని కోరుతున్నారు. ప్రజలు, భక్తులు తమ కష్టార్జిత సొమ్మును దైవకార్యాల కోసం సమర్పిస్తారని, అలాంటి నిధుల వినియోగంలో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఆలయ నిర్వహణపై విచారణ జరిపించాలి**

శ్రీ కనకదుర్గ అమ్మవారి మందిరానికి సంబంధించిన విరాళాలు, కానుకలు, పూజా కార్యక్రమాల వసూళ్లు, మందిర నిర్మాణ నిధులపై సమగ్ర వివరాలను వెల్లడించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఆలయానికి సంబంధించిన ఆదాయ, వ్యయాల లెక్కలను బహిరంగంగా ప్రకటించి, భక్తుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దేవాలయం అంటే భక్తుల విశ్వాసానికి నిలయం. భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఆలయ నిర్వహణపై ఉంది. విరాళాల సేకరణలో పారదర్శకత, పూజా కార్యక్రమాల నిర్వహణలో బాధ్యత, నిర్మాణ నిధుల వినియోగంలో స్పష్టత తప్పనిసరి. స్థానికులు చేస్తున్న ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించి, అవసరమైతే విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# వర్షపు నీటి ముంపునకు చెక్ పెట్టాలి

- డ్రైనేజీ పనుల్లో వేగం పెంచాలి.. నాణ్యతలో రాజీ వద్దు
- రూ.40 లక్షలతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులను పరిశీలించిన మేయర్ మూడ్ గణేష్



కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 14 (మనం న్యూస్): పట్టణంలో వర్షపు నీటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని సూచించారు. కొత్తగూడెం పట్టణంలోని రామవరం ప్రాంతం 15, 16వ డివిజన్ల పరిధిలో జాతీయ రహదారి వెంట సుమారు రూ.40 లక్షల నిధులతో చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను బుధవారం మేయర్ మూడ్ గణేష్ స్థానికులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సమీక్షించి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రధాన రహదారితో పాటు సమీప కాలనీలు జలమయం కాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా డ్రైనేజీ వ్యవస్థను పటిష్టంగా నిర్మించాలని సూచించారు. నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు ఏర్పడకుండా సాంకేతిక ప్రమాణాలను పాటిస్తూ పనులు పూర్తి చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రహదారులపై నీరు నిలిచిపోకుండా, ఇళ్లలోకి వరద నీరు చేరకుండా సమగ్ర ప్రణాళికతో పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా స్థానిక ప్రజలు, పాదచారులు, వ్యాపారులు నిర్మాణ పనుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని మేయర్ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా లేదా నాణ్యతా లోపాలతో పనులు చేపడితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాధనంతో చేపట్టే అభివృద్ధి పనులు దీర్ఘకాలికంగా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని పేర్కొన్నారు.

అనంతరం స్థానికులతో మాట్లాడిన మేయర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ నిర్మాణంలో స్థానికుల సూచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షపు నీటి ముంపు సమస్య పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ, 16వ డివిజన్ కార్పొరేటర్ పద్మ, 14వ డివిజన్ కార్పొరేటర్ సుధాకర్, 17వ డివిజన్ కార్పొరేటర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# లాభాలకు కాంగ్రెస్ ప్రభుత్వం కోత

- వాస్తవ లాభాలు దాచిపెట్టి కార్మికులకు అన్యాయం
- రూ.59 వేల కోట్ల బకాయిలు చెల్లించకుంటే బొగ్గు సరఫరా నిలిపివేత దిశగా ఉద్యమం
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హెచ్చరిక




కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 14(మనం న్యూస్): సింగరేణి కార్మికుల కష్టార్జితానికి న్యాయమైన వాటా కల్పించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వాస్తవ లాభాలను ప్రకటించకుండా కార్మికులకు అన్యాయం చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కార్మికుల శ్రమతో వేల కోట్ల ఆదాయం ఆర్జిస్తున్న సంస్థలో, లాభాల వాటాను గత ఏడాది ఇచ్చిన 34 శాతానికే పరిమితం చేయడం కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందని విమర్శించారు. బుధవారం కొత్తగూడెం శేషగిరి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెల్లడించకుండా కేవలం రూ.1,754 కోట్ల లాభాలనే ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొన్నారు. గత ఏడాది ఇచ్చిన 34 శాతం లాభాల వాటానే ఈ ఏడాది కూడా కొనసాగించడం ద్వారా కార్మికులకు అదనంగా ఒక్క శాతం కూడా పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల చెమటోడ్చి సాధించిన లాభాల్లో న్యాయమైన వాటా ఇవ్వాల్సింది పోయి లాభాల లెక్కలనే ప్రశ్నార్థకం చేయడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. లాభాల వాటా నిర్ణయించే ముందు గుర్తింపు సంఘంతో చర్చించాల్సిన బాధ్యత యాజమాన్యానికి ప్రభుత్వానికి లేదా..? అని ఏఐటీయూసీ నాయకులు ప్రశ్నించారు. గుర్తింపు సంఘాన్ని సమావేశానికి పిలిస్తే వాస్తవ లాభాలపై ప్రశ్నలు ఎదురవుతాయని కార్మికులకు వాటా శాతం పెంచాల్సి వస్తుందనే ఉద్దేశంతోనే సంప్రదింపులకు దూరంగా పెట్టారని ఆరోపించారు. సింగరేణి ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలను పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలతో మాత్రమే చర్చించి లాభాల వాటాను ప్రకటించడం కార్మికుల ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చినట్లుగా ఉందన్నారు. సింగరేణి సంస్థకు జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సుమారు రూ.59 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నప్పటికీ వాటిని వసూలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ధ్వజమెత్తారు. ఈ బకాయిల వసూళ్ల కోసం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విద్యుత్ సౌధ ముట్టడి చేపట్టామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్కను, ఆయన ప్రిన్సిపల్ సెక్రటరీని పలుమార్లు కలిసి విజ్ఞప్తి చేసినా స్పందన రాలేదన్నారు. ప్రభుత్వం ఇకనైనా మేల్కొని సింగరేణికి రావాల్సిన రూ.59 వేల కోట్లను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తాం. అవసరమైతే జెన్‌కో, ట్రాన్స్‌కోకు బొగ్గు సరఫరా నిలిపివేసే దిశగా ఉద్యమాన్ని తీసుకెళ్తాం అని వారు హెచ్చరించారు. సమ్మె నోటీసులో పేర్కొన్న 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరినా వాటి పరిష్కారంలో ఒక్కో డిమాండ్‌ను పరిష్కరిస్తూ మిగిలిన సమస్యలను కూడా త్వరగా పరిష్కరిస్తామని యాజమాన్యం తెలిపిందని అన్నారు. కార్మికుల శ్రమతో సంస్థ లాభాలు ఆర్జిస్తూ అదే కార్మికులకు న్యాయమైన వాటా ఇవ్వడంలో వెనుకడుగు వేయడం అన్యాయమని ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిల వసూలు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులను చైతన్యపరిచి ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను విస్మరిస్తే చూస్తూ ఊరుకోబోమని సింగరేణి ప్రయోజనాల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శులు ఎస్.వి.రమణమూర్తి, జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షులు క్రిస్టోఫర్, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, నాగయ్య, పిట్ కార్యదర్శులు నరేష్, కమల్, నాయకులు బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మనం



## కొత్తగూడెం నియోజకవర్గం

కొత్తగూడెం కార్పొరేషన్ - చుంచుపల్లి - లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్

# ప్రియదర్శినిలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 14 (మనం న్యూస్) : స్థానిక బస్టాండు సమీపంలోని ప్రియదర్శిని డిగ్రీ, పి.జి కళాశాలలో బుధవారము బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఒకరికి ఒకరు పోటీగా భారీ బతుకమ్మలు తయారు చేసి బతుకమ్మ ఆట పాటలతో కళాశాల ఆవరణాన్ని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా వచ్చిన షి టీం ఎస్.ఐ రమాదేవి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిలో భాగంగా బతుకమ్మకు విశేష ప్రాధాన్యత ఉంటుందన్నారు. బతుకమ్మ వేడుకలు నిర్వహించిన కళాశాల సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు, డైరెక్టర్ శ్రీరామనేని చలపతి రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నయీం పాషా , వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పి.డి. కాశిమల్ల రమేష్ మరియు అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐ అఖిల ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహన తనిఖీలు

- మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



లక్ష్మీదేవిపల్లి, అక్టోబర్ 14 (మనం న్యూస్): రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా లక్ష్మీదేవిపల్లి ఎస్ఐ అఖిల ఆధ్వర్యంలో మండలంలోని ప్రధాన కూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహనదారుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ హెల్మెట్ వినియోగం, వాహన బీమా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేకంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ అఖిల వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ఒక్క వ్యక్తి ప్రాణమే కాకుండా, ఆ వ్యక్తిపై ఆధారపడిన కుటుంబం మొత్తం రోడ్డున పడే ప్రమాదం ఉందని సూచించారు. క్షణిక నిర్లక్ష్యం జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందని, కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు చెల్లుబాటయ్యే బీమా పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని, అలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్ఐ అఖిల సూచించారు.

మనం

# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

**– మెప్మా సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విమలాదేవి**



**పాల్వంచ, అక్టోబర్ 14(మనం న్యూస్):** మహిళలు అన్ని రంగాల్లో రాణించి, అభివృద్ధి చెందాలని పాత పాల్వంచ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి అన్నారు. పాత పాల్వంచ గడియకట్ట లో బుధవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ( మెప్మా ), కరుణశ్రీ పేద ప్రాంత సమాఖ్య ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ విమలాదేవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు చేపడుతున్నదని, మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విమలాదేవిని మహిళా సమాఖ్య సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ బి. సరిత, ఆర్.పి. వై. అరుణ కుమారి, కరుణశ్రీ సమాఖ్య అధ్యక్షురాలు జి. ఆదిలక్ష్మి, కార్యదర్శి షేక్ షాహీన్, కోశాధికారి ఎస్. కనకరాణి, సభ్యులు పాల్గొన్నారు.

## ఆప్తులను కోల్పోవడం ఎంతో బాధాకరం : వనమా రాఘవ

**– రమణ చౌదరి, చిన్నారి జాటోత్ ప్రవళిక దశదిన కార్యక్రమంలో వనమా రాఘవేందర్**

**– కుటుంబ సభ్యులకు పరామర్శ**



**పాల్వంచ, అక్టోబర్ 14(మనం న్యూస్):** కుటుంబంలో ఆప్తులను కోల్పోతే, ఆ బాధ వర్ణనాతీతం అని బారాస నాయకులు వనమా రాఘవేంద్రరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన రమణ చౌదరి, చిన్నారి ప్రవళిక దశ దిన ఖర్మలో వనమా రాఘవేంద్ర పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. చిత్రపటాలకు పూలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. అకాల మృతి కుటుంబ సభ్యులకు, బంధువులకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. వారికి మనోధైర్యాన్ని కల్పించారు. ఆప్తులను కోల్పోవడం ఎంతో బాధాకరమని, ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మల్లెల శ్రీరామ్ మూర్తి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కనగాల బాలకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు దాసరి నాగేశ్వరరావు, ఉర్దుఘర్ మాజీ చైర్మన్ అన్వర్ పాషా, సర్పరాజ్, జగన్నాధపురం రమేష్, సురేష్, రాములు, ధర్మసోత్ సేవియా, శంకర్,పెద్ద కుసున, అము, ఉమేష్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.




## ఆదివాసి చట్టాలను పరిరక్షించాలి : జేఏసీ

**– 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి**

**– జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలి**

**పాల్వంచ, అక్టోబర్ 14(మనం న్యూస్):** ఆదివాసి సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఆదివాసుల ఆత్మఘోష మహాధర్నా కార్యక్రమం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బుధవారం నిర్వహించారు. పాల్వంచ నుండి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమానికి తరలారు. జేఏసీ ప్రతినిధులు సోయం సత్యనారాయణ, ఆరెం ప్రశాంత్, దశరథ్ ల నేతృత్వంలో ఆదివాసి సంఘాల నేతలు, కార్యకర్తలు హైదరాబాదుకు చేరుకున్నారు.

**1/70 చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి**

ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని పగడ్బందీగా చిత్తశుద్ధితో అమలు చేయాలని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి చట్టాలకు రక్షణ లేకుండా పోయిందని జేఏసీ ప్రతినిధులు ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతంలో పెసా చట్టం గాడి తప్పి, మునగడ సాగిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. పోడు భూములకు హక్కుపత్రాలు అందించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ హక్కులను కాలరాస్తూ.. కొనసాగుతున్న భూ దోపిడీ, అన్యాక్రాంతం, దాడులను అరికట్టాలని అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేశారు.

జీవో నంబర్ 3 పునరుద్ధరణతో పాటు 29 జీవోలకు రూపకల్పన చేయాలని పేర్కొన్నారు. నిలిచిపోయిన పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధత లేని లంబాడి తెగను తీసివేయాలి ఎస్టీ జాబితా నుండి తొలగించాలని పాలకవర్గాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణ సాధన కోసం పోరాటాలు చేయ్యాలని రాష్ట్ర నాయకులు ఆరేం ప్రశాంత్, సోయం సత్య నారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోయం సత్యనారాయణ చరవాణిలో "మనం" న్యూస్ తో మాట్లాడారు.

## తాగునీటి సమస్యపై తక్షణ స్పందన

### ఒక్కరోజులో మూడు బోర్లు!

**– 60వ డివిజన్ ప్రజల ఇబ్బందుల పరిష్కారానికి కార్పొరేటర్ భీమ శ్రీవల్లి శ్రీధర్ చొరవ**

**– ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సహకారంతో బోర్ల ఏర్పాటు**

**కొత్తగూడెం టౌన్ అక్టోబర్ 14 (మనం న్యూస్):** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 60వ డివిజన్‌లో తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు కార్పొరేటర్ భీమ శ్రీవల్లి శ్రీధర్ చొరవ తీసుకున్నారు. డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను గుర్తించి, ఓ జర్నలిస్ట్ చేసిన అభ్యర్థనపై ఆమె తక్షణమే స్పందించారు. ఈ విషయాన్ని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర దృష్టికి తీసుకెళ్లి, ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు కృషి చేశారు. దీంతో ఒక్కరోజులోనే డివిజన్‌లో మూడు బోర్లను ఏర్పాటు చేయించడంతో స్థానికులకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం లభించింది.

**ప్రజల ఇబ్బందులపై సత్వర స్పందన**

60వ డివిజన్‌లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఓ జర్నలిస్ట్ కార్పొరేటర్ భీమ శ్రీవల్లి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య తీవ్రతను గుర్తించిన ఆమె ఆలస్యం చేయకుండా ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో మాట్లాడి బోర్ల ఏర్పాటుకు కృషి చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఒక్కరోజులోనే మూడు బోర్ల ఏర్పాటు జరగడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను సంబంధిత ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది. ప్రజలకు నిత్యావసరమైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు తీసుకున్న చర్యలపై డివిజన్ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**పార్టీలకు అతీతంగా ప్రజాసేవే లక్ష్యం**



ఈ సందర్భంగా కార్పొరేటర్ భీమ శ్రీవల్లి శ్రీధర్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామా లేదా అనే విషయంతో సంబంధం లేకుండా ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో పార్టీలకు అతీతంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ప్రజలకు తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతామని ఆమె పేర్కొన్నారు.

**ఎంపీకి, కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు**

60వ డివిజన్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుని, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సహకారంతో మూడు బోర్ల ఏర్పాటుకు కృషి చేసిన కార్పొరేటర్ భీమ శ్రీవల్లి శ్రీధర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణమే స్పందించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సమయానికి స్పందించడం, సంబంధిత ప్రజాప్రతినిధుల సహకారంతో అవసరమైన చర్యలు చేపట్టడం ఎంత ముఖ్యమో 60వ డివిజన్‌లో మూడు బోర్ల ఏర్పాటు మరోసారి తెలియజేసింది.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..




# అశ్వారావుపేట

అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చండ్రుగొండ - ములకలపల్లి

# భూ రీ సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలి

## – రామన్నగూడెంలో సర్వేను పరిశీలించిన కలెక్టర్ అంకిత్





**అశ్వారావుపేట, అక్టోబర్ 14(మనం న్యూస్ ) :** అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలో భూ రీ సర్వేను పది రోజుల్లో పూర్తి చేయాలని, అశ్వారావుపేటలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ అశ్వారావుపేట మండలం రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో భూ రీ సర్వే పనులను, అశ్వారావుపేటలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, సర్వే నంబర్లు, గ్రామ సరిహద్దులు, రెవెన్యూ భూములు, అటవీ భూములకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుమారు 600 ఎకరాల విస్తీర్ణంలో భూ రీ సర్వే పనులు కొనసాగుతున్నాయని, సుమారు 8 కిలోమీటర్ల పరిధిలో గ్రామ సరిహద్దులను నిర్ధారించే ప్రక్రియ చేపడుతున్నామని సర్వేయర్లు వివరించారు. గత వారం గ్రామసభ నిర్వహించి గ్రామ సరిహద్దుల నిర్ధారణకు సంబంధించిన పనులు ప్రారంభించినట్లు తెలిపారు. సర్వే నంబర్ 39 పరిధిలో భూములను సాగు చేసుకుంటున్న రైతులతో కలెక్టర్ మాట్లాడి, వారు ఎప్పటి నుంచి భూములను సాగు చేస్తున్నారు, వారి వద్ద పాత పట్టాలు, పాస్‌బుక్‌లు ఉన్నాయా, వాటిని ఎప్పుడు జారీ చేశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద ఉన్న పాత పట్టాలు, పాస్‌బుక్‌లు, ఇతర భూ సంబంధిత పత్రాలను పరిశీలించి రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి వాస్తవాలను నిర్ధారించాలని సూచించారు. మూడు సర్వే నంబర్ల పరిధిలో 181 మంది రైతులు ఉన్నట్లు అధికారులు వివరించగా, వారికి సంబంధించిన పట్టాలు, రైతుబంధు వివరాలు, భూముల సాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ భూముల విస్తీర్ణం, గ్రామ సరిహద్దులు, అటవీ బ్లాక్‌ల వివరాలను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. గతంలో జారీ చేసిన ఉత్తర్వులు, పట్టాలు, గెజిట్ నోటిఫికేషన్లు, అందుబాటులో ఉన్న పాత భూ రికార్డులను సేకరించి ప్రస్తుత రికార్డులతో సరిపోల్చాలని సూచించారు. రికార్డుల్లో నమోదైన వివరాలకు, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులకు మధ్య వ్యత్యాసాలను గుర్తించి, నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలన్నారు. భూ రీ సర్వేను పది రోజుల్లో పూర్తి చేసి, భూముల హద్దులు, విస్తీర్ణం, హక్కులకు సంబంధించిన వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. అనంతరం అశ్వారావుపేటలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. భవన నిర్మాణ ప్రణాళిక, పనుల పురోగతి, విద్యార్థులకు కల్పించనున్న వసతులు, నిర్మాణ పనులు పూర్తి చేసే గడువుపై ఇంజినీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్మాణాన్ని వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో శాఖాహారం, మాంసాహారం వంటశాలలను వేర్వేరుగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. విద్యార్థుల కోసం డైనింగ్ హాల్, సుమారు 1,000 మంది కూర్చునే సామర్థ్యంతో ఆడిటోరియం, టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ క్రీడలకు ప్రత్యేక గదులు, బ్యాడ్మింటన్‌తో పాటు ఇతర క్రీడలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు అనుగుణంగా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. జూనియర్ విద్యార్థుల హాస్టల్‌ను జీ2 అంతస్తుల్లో నిర్మిస్తున్నామని, ఇందులో డార్మిటరీలతో పాటు రెండు అంచెల పడకల సదుపాయం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. నిర్మాణ పనులను గరిష్ఠంగా ఆరు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబర్ నెలాఖరులోగా స్లాబ్ పనులు పూర్తిచేయనున్నట్లు వివరించారు. ప్రస్తుతం సుమారు 100 మంది కార్మికులు నాలుగు బృందాలుగా పనులు నిర్వహిస్తున్నారని, పనుల పర్యవేక్షణకు నలుగురు సైట్ ఇంజినీర్లు, నలుగురు సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల నిర్మాణంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఉండేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని, నిర్మాణ నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ బి కిషోర్ తో పాటు సంబంధిత రెవెన్యూ, సర్వే, అటవీ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.



# అప్పారావుపేటలో తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోపై ప్రచారం

**దమ్మపేట, అక్టోబర్ 14(మనం న్యూస్):** అశ్వారావుపేట నియోజకవర్గంలో తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు కొనసాగు తున్నాయి. ఇందులో భాగంగా నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోడెం వెంకట్ ,ఆధ్వర్యంలో దమ్మపేట మండలంలోని అప్పారావు పేట,లో గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోడెం వెంకట్ ,ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, సామాజిక న్యాయం వంటి అంశాలతో పాటు మేనిఫెస్టోలోని భూలక్ష్మి పథకం గురించి ప్రజలకు వివరించారు. భూలక్ష్మి పథకం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలు, అలాగే మేనిఫెస్టోలోని పంచజన్య పథకాల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకుంటూ, వాటికి అనుగుణంగా మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. ప్రతి కుటుంబానికి మేనిఫెస్టోలోని అంశాలు చేరేలా గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నామని సోడెం వెంకట్ తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను స్వీకరిస్తూ ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.

# మండలంలో పర్యటించిన మెచ్చా

**ములకలపల్లి, అక్టోబర్ 14(మనం న్యూస్) :** అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ములకలపల్లి మండలం లో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. రాజుపేట గ్రామంలో కొయ్యల పీరమ్మ దశ దిన కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఒడ్డుగూడెంగ్రామంలో బిఆర్ఎస్ వార్డ్ మెంబర్ మడకం నరేష్, తండ్రి మడకం చిన్న బుల్లయ్య, స్వర్గస్థులు అవ్వడంతో అతని పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తాండ్ర రాంబాబు ,సుధాకర్ , పోగలపల్లి ఉప సర్పంచ్ కొయ్యల రాజేశ్వరి ,సూరం పుల్లారావు, పురేటి నరసింహ రావు,తాటి ప్రవీణ్ ,బిక్షం ,బాల కృష్ణ ,రావుల కృష్ణ , చిన్నబ్బాయి ,ప్రమోద్ కుమార్ ,కోధుమూరి ప్రకాష్ ఉన్నారు.



# శ్రీ కాత్యాయనీ దేవి అలంకరణలో స్వర్ణ దుర్గమ్మ

## – విజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు
## – ప్రత్యేక పూజలు, చండీ హోమం.. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



**కొత్తగూడెం, టౌన్, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** పట్టణంలోని శ్రీ విజయ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ స్వర్ణ దుర్గ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం (14-10-2026) అమ్మవారికి వివిధ ప్రత్యేక పూజలు, హోమాలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి శ్రీ కాత్యాయనీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మంగళవాద్యాలు, తీర్థపు బిందె, నిత్యార్చన కార్యక్రమాలతో ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. అనంతరం అమ్మవారికి పంచామృత స్నపనం, పీఠార్చన, అనుష్ఠాన కార్యక్రమాలతో పాటు విశేష హోమం, చండీ హోమం నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణార్చన, మహాలక్ష్మి, దుర్గా, చండీ సప్తశతీ పారాయణం, వివిధ అనుష్ఠానాలు, పీఠపూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందారు.



**కాత్యాయనీ దేవి ఆరాధనతో సకల శుభాలు**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాత్రి 8 గంటలకు శ్రీ స్వర్ణ దుర్గ అమ్మవారు శ్రీ కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. నవదుర్గల తొమ్మిది స్వరూపాల్లో కాత్యాయనీ దేవి ఆరవ స్వరూపంగా పూజలందుకుంటారు. ఆ అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

**భక్తులతో కిక్కిరిసిన ఆలయం :**

రాత్రి 10 గంటలకు మహా హారతి నిర్వహించిన అనంతరం ఆలయ బంధనం కార్యక్రమంతో ఆ రోజు పూజా కార్యక్రమాలు ముగిశాయి. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ స్వర్ణ దుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం

## వైద్య చికిత్స కోసం వసుధ ఫౌండేషన్ ఆర్థిక సహాయం




**భద్రాచలం అక్టోబర్ 14( మనం న్యూస్):** భద్రాచలం కుచెందిన వెంకటరమణ అనే మహిళ వైద్య చికిత్స కోసం వసుధ ఫౌండేషన్ రూ. పదివేల ఆర్థిక సహాయం అందించింది. ఇటీవల అస్వస్థతకు గురైన వెంకటరమణ వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించాలని ఆమె కుటుంబ సభ్యులువసుధ ఫౌండేషన్ ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో స్పందించిన వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు రూ 10,000 ఆర్థిక సహాయం అందించాలని వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు కు సూచించారు. ఈ క్రమంలో భద్రాచలం సీఐ పట్ల రాజు చేతుల మీదుగా వెంకటరమణ భర్త సోమయ్యకు రూ పదివేలకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.




## నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాల గోడపత్రిక విడుదల

**భద్రాచలం ,అక్టోబర్ 14( మనం న్యూస్ ):** గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో ట్రైకార్ గిరిజన సంక్షేమ శాఖ – తెలంగాణ ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో నిర్వహించనున్న రెండో విడత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికను విడుదల చేయడం జరిగిందని ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు.బుధవారం నాడు తన ఛాంబర్ లో నైపుణ్య అభివృద్ధి గోడపత్రికలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రెండో విడతలో గిరిజన యువత కోసం పలు నూతన కోర్సులతో పాటు వివిధ వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, వీటిలో డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆయన అన్నారు.ఈ శిక్షణ కార్యక్రమాల ద్వారా యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించి, వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలకు మార్గం సుగమం చేయనున్నామని ఆయన అన్నారు.ఈ శిక్షణ కార్యక్రమాల ప్రత్యేకత అర్హులైన గిరిజన యువతకు ఉచిత శిక్షణ, ఉచిత భోజన సదుపాయం, ఉచిత వసతి సౌకర్యం కల్పించబడతాయని, ఇబ్బందులు లేకుండా యువత శిక్షణ పొందేందుకు ఈ సదుపాయాలు దోహదపడతాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, వైటీసీ మేనేజర్ నక్క శ్రీను, వైటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఎక్సైజ్ బలగాల మెరుపు దాడి

- 3,200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం
- తెలంగాణ--ఏపీ అధికారుల సంయుక్త ఆపరేషన్
రెండు కేసులు నమోదు



**భద్రాచలం, అక్టోబర్ 14 (మనం న్యూస్):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ నాటుసారా తయారీపై ఎక్సైజ్, పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. ఖమ్మం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ (డీసీ), ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ, కొత్తగూడెం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి (డీపీఈవో) ఆదేశాల మేరకు బుధవారం ఇరు రాష్ట్రాల అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలోని ఎటపాక మండలం, చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండువారిగూడెం, పిచుకలపాడు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సారా బట్టీలపై దాడి చేసి, తయారీ కోసం సిద్ధంగా ఉంచిన సుమారు 3,200 లీటర్ల బెల్లం పులుసు (వాష్)ను నేలమట్టం చేశారు. ఈ అక్రమ తయారీకి సంబంధించి ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

**భారీగా మోహరించిన బలగాలు...**

ఈ సంయుక్త ఆపరేషన్‌లో తెలంగాణ తరపున ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏసీ నరేందర్, కొత్తగూడెం డీటీఎఫ్ బృందం, మణుగూరు ఎస్‌హెచ్‌ఓ నాగేశ్వర్ రావు, పాల్వంచ ఎస్‌హెచ్‌ఓ అశోక్ కుమార్, భద్రాచలం ఎక్సైజ్ సీఐ బి. కిష్టయ్య పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అనకాపల్లి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్--ఏసీ సురేష్, రంపచోడవరం ఏఈఎస్ ఓ డీటీఎఫ్ సుబ్రహ్మణ్యం, చింతూరు ఎస్‌హెచ్‌ఓ విజయలక్ష్మి, ఎటపాక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సిబ్బంది కరీం, సీతారామ్, శ్రావణ్, జమాల్, రాకేష్, కిరణ్, సుజాత తదితరులు తనిఖీల్లో పాలుపంచుకున్నారు.

**గ్రామాల్లో అవగాహన సదస్సు:**

దాడుల అనంతరం గుండువారిగూడెం, పిచుకలపాడు గ్రామ ప్రజలతో అధికారులు ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. నాటుసారా సేవించడం వల్ల ప్రాణాలకే ప్రమాదమని, కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా చిన్నాభిన్నమవ ౖతాయని వివరించారు. ఎవరైనా నాటు సారా తయారీ, రవాణా, నిల్వ, విక్రయా లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు సహకరించాలని, సమాచారం ఉంటే వెంటనే అధికారులకు చేరవేయాలని పిలుపునిచ్చారు. సరిహద ్దుల్లో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజారో గ్యమే లక్ష్యంగా ఇరు రాష్ట్రాల సమన్వయంతో ఇలాంటి దాడులు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## అంగరంగ వైభవంగా నాలుగో రోజు బతుకమ్మ సంబరాలు



**భద్రాచలం, అక్టోబర్ 14( మనం న్యూస్ ):**శ్రీ ద్వారకాసాయి శివ ముత్యాలమ్మ తల్లి ఆధ్వర్యంలో ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలుతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మెడికల్ కాలనీలో నాలుగవ రోజు బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. పూలను పూజిస్తూ, ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ ఆడబిడ్డలు జరుపుకునే ఈ పూల పండుగలో మహిళలు ఉత్సాహంగా పాల్గొంటూ పండుగ శోభను మరింత పెంచుతున్నారు.ద్వారకా సాయి శివ ముత్యాలమ్మ తల్లి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బతుకమ్మ వేడుకలు సంప్రదాయబద్ధంగా, సందడిగా కొనసాగుతున్నాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతిపై వారికున్న ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ సంబరాల్లో మునిగిపోయారు.బతుకమ్మ పాటలతో మెడికల్ కాలనీ పరిసరాలు సందడిగా మారాయి. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయడంలో బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మగా పేర్చి పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. మహిళలందరినీ ఒకచోట చేర్చి సోదరభావం, ఐక్యత, ఆనందాన్ని పంచే ఈ వేడుకలు తెలంగాణ పల్లె సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి. ఈ బతుకమ్మ సంబరాలు మహిళల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతూ, మెడికల్ కాలనీలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ పూలను పూజించి.. ప్రకృతిని ఆరాధించి.. తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే బతుకమ్మ పండుగ మెడికల్ కాలనీతో పాటు పలు కాలనీలలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నింపుతోంది.

## కొమరం భీమ్ విగ్రహం నిర్మాణ పనులను పరిశీలించిన తహశీల్దార్

- కొమరం భీమ్ పేరిట షెడ్ నిర్మాణం చేస్తున్నందుకు అభినందనలు



**దుమ్ముగూడెం అక్టోబర్ 14 (మనం న్యూస్):** దుమ్ముగూడెం మండల పరిధి ములకపాడు జంక్షన్ లో ఆదివాసీ సంఘాల ఐక్య కార్యచరణ వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఆదివాసీల ఆరాధ్య దైవం పోరాట యోధుడు కొమరం భీం విగ్రహ ఏర్పాటు పనులను దుమ్ముగూడెం తహసిల్దార్ ఎం అశోక్ కుమార్ బుధవారం పరిశీలించారు. అక్టోబర్ 22 విగ్రహ ఆవిష్కరణ తేదీ సమీపిస్తున్నందున త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని అన్నారు.కొమరం బీమ్ విగ్రహం పక్కనే నూతనంగా నిర్మిస్తున్న కొమరం బీమ్ షెడ్ నిర్మాణ పనిని పరిశీలించిన అయన ఈ ప్రాంత ప్రయాణికులకు, ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని మంచి కార్యక్రమం చేపట్టారని అభినందించారు. అనంతరం విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించి విగ్రహం సెంకుస్థాపనకు ముఖ్య అతిథిగా హాజరయ్యారని విగ్రహ ఆవిష్కరణ కు కూడా ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ ఎమ్మార్వో కార్యాలయం లోతహసీల్దార్ ని, డిప్యూటీ తహసిల్దార్ భరణి బాబుని ఆదివాసి సంఘాల ఐక్య కార్యచరణ వేదిక కమిటీ నాయకులు కలిసి ఆహ్వాన పత్రాలను అందించారు.ఈ కార్యక్రమంలో ఐక్య కార్యచరణ వేదిక కమిటీ గౌరవ అధ్యక్షులు కొమరం దామోదర్ రావు కన్వీనర్ కుంజ. శ్రీనివాసరావు, ఆదివాసి నాయకులు సోయం కామరాజు, తెల్లం. హరికృష్ణ, సొంది.మల్లు దొర సర్పంచులు కురసం. రవి, పొడియం సుబ్బారావు, నాయకులు తునికి కామేశ్వరరావు, పెనుబల్లి చంటి కోయ నరసాపురం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ పాల్గొన్నారు.

# ఐదో రోజు అట్ల బతుకమ్మ సంబురాలు

## - వాడవాడలా మహిళల కోలాహలం







**చర్ల, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** బతుకమ్మ సంబురాలు ఐదో రోజు అదే ఉత్సాహంతో కొనసాగాయి. బుదవారం అట్ల బతుకమ్మ సందర్భంగా చర్లలోని శాంతిభవనం, రఘు దియేటర్ రోడ్, గణేష్ నగర్, పాతచర్ల, కొడిపెగుంపు, విజయకాలని, లక్ష్మికాలని, రాళ్లగూడెం లతో పాటు మండలంలోని పలు గ్రామాలలోని వీధి పూల సువాసనలతో, బతుకమ్మ పాటలతో కళకళలాడింది. ఆశ్వయుజ శుద్ధ పంచమి నాడు మహిళలు అట్లను నైవేద్యంగా సమర్పించడం ఆనవాయితీ. బియ్యం పిండి, పాలతో చేసిన దోశను నైవేద్యంగా అమ్మవారికి పెట్టారు. పంటలు చేతికి వచ్చే సమయంలో కొత్త బియ్యంతో చేసి అమ్మవారికి నైవేద్యం పెట్టేవారని పెద్దలు చెబుతారు. ఉదయం నుండే మహిళలు గునుగు, తంగేడు, బంతి పూలతో ఎత్తుగా బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను ప్రతిష్టించి పూజలు చేశారు. సాయంత్రం సంప్రదాయ దుస్తుల్లో పాటలు పాడుతూ ఆడిపాడారు. శాంతిభవనం వద్ద మహిళలు రోజుకొక రంగు చీరతో బతుకమ్మ సంబురాలు జరుపుకుంటుంన్నారు. గద్దె వద్ద ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను అందచేస్తున్నారు. అనంతరం అట్లను వాయనంగా ఇచ్చిపుచ్చుకుని సంతోషంగా పండుగను జరుపుకున్నారు. ఈ వేడుకల్లో మహిళా సంఘాల సభ్యులు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మహాచండీ అవతారంలో దుర్గమ్మ











**చర్ల, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా బుదవారం అమ్మవారు మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెడుపై పోరాడే శక్తి స్వరూపిణి, చండీ హోమంలో పుట్టిన అమ్మవారు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం అవతరించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే భయాలు తొలగిపోయి, శత్రు బాధలు తొలగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. చర్లలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయం, త్రికూట దేవాలయం, శివాలయం, రైస్ పేట బండాలమ్మ తల్లి దేవాలయం, లారీ ఓనర్స్ అసోసియేషన్, అంబేద్కర్ సెంటర్, గొల్లకట్ట వీది, సాలెబజార్, మొగళ్లపల్లి రామాలయం, కుదునూరు గ్రామంలో గల ఆలయంలో పురోహితులు ఉదయం నుండి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాచండీ హోమం, చండీ సప్తశతి పారాయణం, కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఎర్రటి వస్త్రాలు, ఎర్ర పూలతో, త్రిశూలం, ఖడ్గంతో అలంకరించి భక్తులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. తెల్లవారుజాము నుండే భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా "జై మహా చండీ.. జై దుర్గా భవాని" అనే భక్తి నినాదాలతో మార్మోగింది. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు.

మనం



# చర్ల

## చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం

## నీట మునిగి బాలుని మృతి



**చర్ల, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** తేగడ హైలెవల్ వంతెన సమీపంలోని తాలిపేరు నదిలో మునిగి చర్లలోని గొల్లకట్టకు చెందిన దగ్గుపల్లి వెంకటేష్ (16) అనే బాలుడు మృతి చెందిన ఘటన బుదవారం చోటు చేసుకుంది. చర్లకు చెందిన కొంతమంది భవాణి మాలదారులతో కలసి వెంకటేష్ తాలిపేరు నదిలో స్నానం చేసేందుకు వెల్లాడు. స్నానం చేసే ప్రాంతంలో లోతు ఎక్కువగా ఉండటంతో బాలుడు నీట మునిపోతుండగా భవానీలు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్ ఐ నర్సిరెడ్డి ఘటనా ప్రాంతానికి చేరుకొని జాలర్లు, స్థానికుల సహాయంతో గాలింపు చేపట్టి బాలుని మృతదేహాన్ని వెలుపలికి తీసారు. అనంతరం మృతదేహాన్ని చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించగా వైద్యాదికారి డాక్టర్ సాయివర్దన్ పోస్ట్ మార్టం నిర్వహించి మృతదేహాన్ని బందువులకు అప్పగించారు.

## మాజీ ఎమ్మెల్యే రేగా ఆస్తుల వివరాలు తేల్చాలి



**అశ్వాపురం, అక్టోబర్ 14 ( మనం న్యూస్ ):** ఆస్తుల గురించి మాట్లాడే ముందు పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తన ఆస్తుల లెక్కలు తేల్చాలని,దొంగే దొంగ దొంగ అన్నట్లుగా రేగా వ్యవహారం ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు ధ్వజమెత్తారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుపై రేగా చేసిన ఆరోపణల నేపథ్యంలో, మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు మాట్లాడుతూ, ఇతరుల ఆస్తులపై విమర్శలు చేసే ముందు, మీ ఆస్తుల వివరాలను ప్రజల ముందు పెట్టే ధైర్యం ఉందా అంటూ, రథంగుట్ట భూముల వ్యవహారంపై ముందుగా స్పష్టత ఇవ్వాలన్నారు. ఆ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందుంచి, అనుమానాలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాయం వెంకటేశ్వర్లుపై చవకబారు విమర్శలు చేసే ముందు, మీపై వస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలన్నారు. 2009 ఎన్నికల అఫిడవిట్‌లో మీరు ప్రకటించిన ఆస్తులెన్ని ? ప్రస్తుతం మీ పేరు మీద, మీ కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తులెన్ని ? అప్పటికి, ఇప్పటికి ఆస్తుల్లో వచ్చిన మార్పులపై ప్రజలకు స్పష్టమైన లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎవరి హయాంలో ఎంత భూమి కబ్జాకు గురైంది ? ఎవరి పాలనలో ఎలాంటి భూ లావాదేవీలు జరిగాయి? ఈ అంశాలపై ఆధారాలతో సహా బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. ఫారెస్టు భూ ఆక్రమణలకు సంబంధించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న మీరు, ఇతరులపై విమర్శలు చేసే అర్హతలేదని తెలుసుకోవాలన్నారు. చవకబారు విమర్శలు చేసేముందు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ఇతరుల ఆస్తుల గురించి మాట్లాడే ముందు మీ ఆస్తుల వివరాలు ప్రజలకు చెప్పాలన్నారు. నిన్ను ఎమ్మెల్యేని చేసిన పార్టీ ఆఫీస్ నే కబ్జా చేసి, కబ్జాలకు బ్రాండ్ అంబాసిడర్ గా నిలిచిన నీవు పాయం వెంకటేశ్వర్లు మీద ఆరోపణలు చేయటం హాస్యాస్పదంగా ఉందని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఊసా అనిల్ కుమార్, వేములపల్లి రమేష్, మచ్చా నరసింహారావు, కుంజా జాను, ఆవుల రవి, బూరెడ్డి వెంకటరెడ్డి, తూము వీరాఘవులు, కాకా రాములు , బచ్చు వెంకటరమణ, సామకూర వెంకన్న, మట్టా వీరభద్రారెడ్డి, వెంకటాచారి, తెల్లం నాగరాజు, మోసీన్ గొల్లపల్లి నరేష్, వేముల విజయ్, కంటెం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మనం



# ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి



## టేకులపల్లి మండల ఫొటోగ్రాఫర్స్ అధ్యక్షుడిగా అలవాల శ్రీనివాస్ విజయం...

**టేకులపల్లి, అక్టోబర్ 14(మనం న్యూస్):** టేకులపల్లి మండల ఫొటోగ్రాఫర్స్ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా అలవాల శ్రీనివాస్ ప్యానెల్ విజయం సాధించింది. బుధవారం టేకులపల్లి మండల కేంద్రంలోని సేవాలాల్ టెంపుల్ వద్ద జిల్లా ఫొటోగ్రాఫర్స్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా అలవాల శ్రీనివాస్ ఎన్నిక కాగా, ఉపాధ్యక్షుడిగా యాసం రమేష్, కోశాధికారిగా రవి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఫొటోగ్రాఫర్స్ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఫొటోగ్రాఫర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ,వారి అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు.



## ఘనంగా అట్ల బతుకమ్మ వేడుకలు

**- సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేసిన మహిళలు**

**టేకులపల్లి, అక్టోబర్ 14(మనం న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా టేకులపల్లి మండలంలోని గోలియా తండా కోదండ రామాలయ ప్రాంగణంలో బుధవారం అట్ల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుంచే మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి, సంప్రదాయ పద్ధతిలో అందంగా బతుకమ్మలను పేర్చారు. తంగేడు, గునుగు తదితర పూలతో ఆకర్షణీయంగా బతుకమ్మలను అలంకరించి ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. అనంతరం బతుకమ్మలను ఒకచోట ఉంచి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటలాడుతూ సందడి చేశారు. మహిళల కోలాటాలు, బతుకమ్మ పాటలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. పూల పండుగ ప్రత్యేకతను చాటిచెబుతూ మహిళలు భక్తిభావంతో వేడుకల్లో పాల్గొన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు,ప్రకృతిపై ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని పలువురు మహిళలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తూ, భావితరాలకు తెలంగాణ సంస్కృతి గొప్పదనాన్ని తెలియజేయడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తున్నాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. అట్ల బతుకమ్మ వేడుకలతో గోలియా తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో సర్పంచులు లకావత్ నాకా, బోడ బాలు నాయక్,గుడిపూడి మోహన్ రావు గుడిపూడి సత్యనారాయణ, తేజవత్ కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

# శవయాత్రలో బాణాసంచా పేలుడు..

**- చిన్నారుల పరిస్థితి విషమం!**
**- శవయాత్రలో అపశ్రుతి.. మంటల్లో చిక్కుకుని చిన్నారులకు తీవ్ర గాయాలు**
**- 70 శాతం వరకు కాలిన గాయాలు..**
**- మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలింపు**





**టేకులపల్లి,అక్టోబర్ 14(మనం న్యూస్):** టేకులపల్లి మండల పరిధిలోని వెంకటయ్య తండా లో టపాసుల మోత చిన్నారుల జీవితాలలో విషాదాన్ని నింపింది. ఓ వ్యక్తి అంత్యక్రియల సందర్భంగా నిర్వహించిన శవయాత్రలో టపాసులు పేలడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో భూక్య రానా,అంగోత్ ధ్రువన్ తో పాటు పదకొండు ఏళ్ల చిన్నారి మంటల్లో చిక్కుకుని తీవ్రంగా గాయపడ్డాడు. డ్రైవర్ నవీన్ కు గాయాలు కాగా, రవికుమార్ స్వల్పంగా గాయపడ్డాడు. చిన్నారుల పరిస్థితిని చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతుండగా, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. శవయాత్రలో ప్రమాదం.. టేకులపల్లి మండలం వెంకట్యతండా గ్రామంలో బుధవారం ఓ వ్యక్తి మృతి చెందడంతో అంత్యక్రియల సందర్భంగా శవయాత్ర నిర్వహించారు. ఈ క్రమంలో డీజే కోసం ఏర్పాటు చేసిన వాహనం క్యాబిన్‌లో టపాసులు ఉంచి, అవసరమైనప్పుడల్లా బయట ఉన్న వారికి అందిస్తున్నట్లు సమాచారం. ఈ సమయంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి క్యాబిన్‌లో ఉన్న టపాసులు ఒక్కసారిగా పేలాయి. దీంతో క్యాబిన్‌లో ఉన్న చిన్నారులు మంటల్లో చిక్కుకుని బయటకు రావడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ప్రమాదంలో చిన్నారులకు సుమారు డెబై శాతం వరకు కాలిన గాయాలైనట్లు తెలిసింది. డ్రైవర్ తల భాగంలోని వెంట్రుకలు స్వల్పంగా కాలిపోయాయి.

**మెరుగైన వైద్యం కోసం ఖమ్మంకు తరలింపు**

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారులకు తొలుత రిమ్స్ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, వారిలో ఇద్దరి పరిస్థితి కొంత విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. చిన్నారుల పరిస్థితిని చూసి గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. కొద్దిసేపటి క్రితం వరకు ఆనందంగా ఆడుకుంటూ కనిపించిన చిన్నారులు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకోవడంతో వారి కుటుంబాల్లో తీరని ఆవేదన నెలకొంది. ఘటనా స్థలాన్ని పరిశీలించిన టేకులపల్లి ఎస్సై తిరుపతి. ప్రమాద సమాచారం తెలుసుకుని తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. గాయపడిన చిన్నారులకు ప్రథమ చికిత్స అందించే వరకు ఆయన ఆసుపత్రిలో ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రమాదాలు చెప్పి రావని, టపాసుల వినియోగంలో నిర్లక్ష్యం ప్రాణాలకే ముప్పు తెస్తుందని హెచ్చరించారు. పోలీసులు పలుమార్లు అవగాహన కల్పిస్తున్నప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ఆదివాసి హక్కుల పోరాట సమితి కమిటీ ఎన్నిక

**ఇల్లందు, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** ఇల్లందు పట్టణం పెన్షనర్ భవన్లో, ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకోవటం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా, ప్రొఫెసర్ ఈసం సారయ్య దొర , ప్రొఫెసర్ గట్టి ఎల్లయ్య, పాల్గొనడం జరిగింది, వారి పర్యవేక్షణలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరిగింది. 1ఈసంనరసింహారావు,రాష్ట్ర అధ్యక్షులు2 పెందుర్ జలపతి, జారే కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు. 3 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఆగబోయిన రవి. 4 జార్కే పాండురం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి. 5 యం, బుచ్చి రాములు రాష్ట్ర కార్యదర్శి. జాతీయ కమిటీ 1 జాతీయ అధ్యక్షులుగా,గోగ్గల కోటయ్య. 2 మెస్రం మోతిరామ్, జాతీయ ప్రధాన కార్యదర్శి. ఈ కమిటీ తీర్మానములంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలి. షెడ్యూల్ ప్రాంతంలో 29 శాఖలలో ఉద్యోగాలన్నీ ఆదివాసులతో భర్తీ చేయాలి. జీవో నెంబర్ 3 కి బదులుగా కొత్త చట్టం తీసుకురావాలి. ప్రత్యేక ఐటిడిల ద్వారానే ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు భర్తీ చేయాలి. 1/70 పేసా చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలి.



పోడు భూములకు అటవీ హక్కుల చట్టం పట్టాలు కాకుండా రెవెన్యూ ద్వారా పూర్తి హక్కులతో పట్టాలు ఇవ్వాలి. 1/70 తీసివేయాలని గిరిజనేతరులు కోర్టులో వేసిన గిరిజనేతరులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలి. ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలని కాపాడుతు విద్య ఉద్యోగం ఆదివాసి ప్రాంతాల నిరంతర సమస్యలపై ఆదివాసి ప్రాంతాల రక్షణకై నిరంతరం పోరాటం చేయాలని ఈ కమిటీ తీర్మానం చేసింది.

# జీఎం కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**ఇల్లందు, అక్టోబర్ 14 )మనం న్యూస్) :** ఇల్లందు ఏరియా జనరల్,మేనేజర్కార్యాల యంలో బుధవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య, గౌరవ అతిథిగా సేవా అధ్యక్షురాలు,వి. రమహాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ మహిళలు వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడటం ఈ పండుగ ప్రత్యేకతఅనితెలిపారు. తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో బతుకమ్మను పూజించి, చివరి రోజున నిమజ్జనంచేయడంఆనవాయితీగావస్తోందన్నారు. బతుకమ్మ పాటల్లో మహిళల జీవన విధానం, కష్టసుఖాలు, ప్రేమాభిమానాలు, బంధుత్వాలు, భక్తిభావాలుప్రతిబింబిస్తాయని వివరించారు. తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పే బతుకమ్మ పండుగకు రాష్ట్ర ఆవిర్భావం అనంతరం మరింత ప్రాచుర్యం లభించిందన్నారు.



తరతరాలుగా కొనసాగుతున్న ఈ పండుగ తెలంగాణ ప్రజల ఐక్యతకు,మహిళలసాంస్కృతిక వైభవానికి ప్రతీకగానిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అజ్మీర తుకారాం, డీజీఎం (ఫైనాన్స్) నాగలక్ష్మి, డిజియం (ఐ.ఇ.డి) ప్రభాకర్ శ్రీ రామమూర్తి, తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం..



# మణుగూరు

మణుగూరు మున్సిపాలిటీ - మణుగూరు మండలం - అశ్వాపురం - బూర్గంపాడు

## క్లీన్ మణుగూరు కోసం సమరశంఖం

- దుమ్ము సమస్యపై రాస్తారోకో
- భూములపై రేగా బహిరంగ సవాల్
- పాయం.. దమ్ముంటే చర్చకు రా
- నా ఆస్తుల వివరాలు ఇస్తా..
- నీ ఆస్తుల లెక్కలు చెప్పు : రేగా



**మణుగూరు, అక్టోబర్ 14(మనం న్యూస్):** మణుగూరు పట్టణాన్ని క్లీన్ మణుగూరుగా మార్చే వరకు తమ ఉద్యమం ఆగదని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు స్పష్టం చేశారు. పట్టణ రహదారులపై దుమ్ము, ధూళి నివారణకు చర్యలు తీసుకోవాలని, దుమ్ము ఎక్కువగా లేచే ప్రాంతాల్లో నీటిని చల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. మణుగూరు పట్టణంలో ఇసుక, బొగ్గు లారీల రాకపోకలతో పాటు గుట్టమల్లారం వైపు వెళ్లే ఇసుక లారీల కారణంగా రహదారులపై విపరీతంగా దుమ్ము, ధూళి వ్యాపిస్తోందని ఆరోపించారు. దీంతో ప్రజలు రోడ్లపైకి రావాలంటే భయపడుతున్నారని, శ్వాసకోశ, ఇతర ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దుమ్ము నివారణకు నీటిని చల్లాలని కోరితే తమపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

**భూములపై బహిరంగ చర్చకు సిద్ధమా?**

పామాయిల్ తోటపై ఎన్నిసార్లు ఫిర్యాదులు చేయిస్తావంటూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును రేగా కాంతారావు ప్రశ్నించారు. తుమ్మలచెరువులో కొనుగోలు చేసినట్లు పేర్కొంటున్న 50 ఎకరాల భూమిలో అటవీ భూమి ఎంత, ప్రభుత్వ భూమి ఎంత అనే అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఇద్దరి ఆస్తుల వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి, వారసత్వంగా వచ్చిన ఆస్తులు, సంపాదించిన ఆస్తుల వివరాలను ప్రజల ముందు ఉంచుదామని అన్నారు. మొరంపల్లి బంజర, దుమ్ముగూడెం, హైదరాబాద్‌లోని భూముల వివరాలతో పాటు మణుగూరు పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల విక్రయాలు, ఆక్రమణలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఆరు ఎకరాల భూమికి పట్టా కోసం దరఖాస్తు చేసిన అంశాన్ని కూడా తేల్చుకుందామని పేర్కొన్నారు. విజయనగరం ప్రాంతంలో సింగరేణి భూములకు సంబంధించి బినామీ పేర్లతో జరిగినట్లు ఆరోపిస్తున్న వ్యవహారాలు, గిరిజన ప్రాంతాల్లో 22-ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వివరాలపైనా ప్రశ్నలు లేవనెత్తారు. ఈ అంశాలకు సంబంధించి తన వద్ద వివరాలు ఉన్నాయని, ఒక్కొక్కటిగా బయటపెడతానని తెలిపారు. దివంగత నేత పుచ్చలపల్లి సుందరయ్యను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో నిజాయితీని నిరూపించుకుందామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు పిలుపునిచ్చారు. బహిరంగ చర్చ ఎప్పుడు, ఎక్కడ, ఏ మీడియా సమక్షంలో నిర్వహించాలనే నిర్ణయాన్ని పాయంకే వదిలేస్తున్నానని రేగా కాంతారావు పేర్కొన్నారు.

## రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందజేత

- పినపాక ఎమ్మెల్యే ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, అక్టోబర్ 14(మనం న్యూస్):** మణుగూరు మండలం సుందరయ్య నగర్‌కు చెందిన దొమ్మేటి ఏడుకొండలుకు వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల విలువైన ఎల్‌ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్)ని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, మెరుగైన వైద్య చికిత్స పొందేందుకు ఆర్థిక సహాయం అందించడంలో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, అర్హులైన వారికి అవసరమైన సహాయాన్ని అందిస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు ఏదైనా ఆపద ఎదురైనప్పుడు అధైర్యపడకుండా ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరినాకి నవీన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, చిట్టి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



**అశ్వాపురం, అక్టోబర్ 14 ( మనం న్యూస్ ):** లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం స్టార్స్, వైరా లయన్స్ కంటి ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని కాలువ బజార్ లో గల సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో సుమారు 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం 25 మందికి కంటి శస్త్రచికిత్సలు, మరో 50 మందికి కళ్లద్దాలు అవసరమని వైద్యులు గుర్తించారు. మిగిలిన వారికి ఉన్న స్వల్ప కంటి సమస్యలకు కంటి చుక్కల మందులను అందజేశారు. శస్త్రచికిత్సలు అవసరమైన 25 మందికి శుక్రవారం వైరా కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ జోన్ చైర్మన్ సత్యప్రకాష్ నల్లగట్ల మాట్లాడుతూ, ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ మనోహర వర్మ, మణుగూరు లయన్స్ క్లబ్ చాప్టర్ ప్రెసిడెంట్ బూర్గుల సురేష్, సెక్రటరీ ఎం. శ్రీనివాస్, లయన్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రజల సంక్షేమానికి పెద్దపీట

- ఇందిరమ్మ ఇళ్లతో నిరుపేద కుటుంబాల్లో కొత్త వెలుగులు
- అర్హులైనా కుటుంబాలకు ఇంటి పట్టాల పంపిణీ
- పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, అక్టోబర్ 14(మనం న్యూస్):** మణుగూరు మండలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారంతో ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు, పట్టాల పంపిణీ ద్వారా వారి సొంతింటి కలను నిజం చేసేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, నిరుపేద కుటుంబాలకు గృహ భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కలగడంతో పాటు వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురిస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పినపాక నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి భరోసా కల్పించే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఎంపీవో, హౌసింగ్ ఏఈ, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, మైనారిటీ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.1.75 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ప్రారంభం

- అభివృద్ధి వైపు పాయం అడుగులు
- పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, అక్టోబర్ 14(మనం న్యూస్):** మణుగూరు సమితి సింగారంగ్రామపంచాయతీ పరిధిలో పట్టణ అభివృద్ధిలో భాగంగా జూనియర్ కళాశాల నుంచి రైల్వే గేట్ వరకు రూ.1 కోటి 75 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మణుగూరు పట్టణాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పట్టణంలోని ప్రధాన రహదారులపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం వల్ల రాత్రి వేళల్లో వెలుతురు పెరిగి, ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారులు, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని వెల్లడించారు. మణుగూరు పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా అధ్యక్షురాలు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

మనం



# పినపాక

మణుగూరు - అశ్వాపురం - పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు

## నేడు గుండాలలో ఎమ్మెల్యే పాయం పర్యటన....

**- ముత్తాపురం గ్రామంలో ఇందిరమ్మ గృహప్రవేశాల ప్రారంభోత్సవం, స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ లో పాల్గొన్నారు.**

**కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఊకె బుచ్చయ్య**

**గుండాల,అక్టోబర్ 14(మనం న్యూస్):** గుండాల మండలం లోని ముత్తాపురం గ్రామ పంచాయతీ లో పలు ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశం, గుండాల రైతు వేదిక నందు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం లో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొంటారు.కావున మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, వార్డు మెంబెర్స్, కార్యకర్తలు సకాలంలో పాల్గొని పర్యటనను జయప్రదం చేయవలసిందిగా కోరారు.





## రెవిన్యూ శాఖలో ఇష్టానుసారంగా సర్టిఫికెట్ల పంపిణీ...

**- ఆదివాసి సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు పెండకట్ల మహేందర్..**

**గుండాల,అక్టోబర్ 14(మనం న్యూస్):** గుండాల మండలం కేంద్రంలోని కొనవారిగూడెం గ్రామంలో అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగినది.ఈ సమావేశంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ గుండాల మండల అధ్యక్షులు పెండకట్ల మహేందర్ పాల్గొని మాట్లాడుతూ. గుండాల మండలం కోనవారిగూడెం రెవెన్యూ పరిధిలోని కోనవారిగూడెం గ్రామంలో గల అంగన్వాడీ కార్యకర్త,ఆయా పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయగా గుండాల రెవిన్యూ గ్రామ పరిధిలోని సూక్య తండాకు చెందినటువంటి మహిళకు రెవిన్యూ సిబ్బంది కోనవారిగూడెంలో నివాసముంటున్నట్టు నివాస ధ్రువీకరణ పత్రంతోపాటు, క్యాస్ట్ సర్టిఫికెట్ మంజూరు మంజూరు చేసిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. అంతేకాకుండా ఉద్యోగ నిమిత్తమే ఈ కోనవారిగూడెం లో ఖాళీ ఉన్నదని తెలుసుకొని. రెవిన్యూ సిబ్బందితో కలిసి తప్పుడు పత్రాలతో ప్రభుత్వాన్ని నమ్మబలికే విధంగా వ్యవహరించింది. ఈ మధ్యకాలంలో కూడా హైకోర్టు స్పష్టమైన జడ్జిమెంట్ ఇవ్వడం జరిగినది లంబాడ సామాజిక వర్గం 1976లో కలపబడిన కూడా వాళ్ళ 1950లో ఈ ప్రాంతంలో ఉన్నట్టు నిరూపించుకోవాల్సి ఉంటుందని హైకోర్టు చెప్పింది.కానీ రెవిన్యూ అధికారులు అవేమీ పట్టకుండా ఇష్ట రాజ్యాంగ క్యాస్ట్ సర్టిఫికెట్లు మంజూరు చేయడమే కాకుండా నివాస ధ్రువీకరణ పత్రాలు కూడా మంజూరు చేసి ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగ ఉపాధి అవకాశాలను రాకుండా చేస్తున్నారని ఈ సందర్భంగా ఆరోపిస్తున్నాం. ఇప్పటికైనా కోన వారి గూడెం నుండి లంబాడ సామాజిక వర్గానికి ఇచ్చినటువంటి ఎస్టీ సర్టిఫికెట్ పై సమగ్ర విచారణ జరిపి దానిపైన పూర్తి విచారణ చేసి ఆ సర్టిఫికెట్ నివాస ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని ఒకవేళ రద్దు చేయకపోతే మేం తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరిస్తున్నాం.ఈ కార్యక్రమంలో కోనవారిగూడెం గ్రామస్తులు సనప సమ్మయ్య, సుబ్బారావు,జానకి,ఏ వెంకటేష్,కిరణ్, లక్ష్మీనారాయణ, రాంబాబు,సమ్మక్క, రాధాకృష్ణ, సాంబశివరావు, జయమ్మ,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## 5 లక్షల ఎల్ఓసీ అందజేసిన పినపాక ఎమ్మెల్యే పాయం

**పినపాక, అక్టోబర్ 14 ( మనం న్యూస్):** పినపాక మండలం, పొట్లపల్లి గ్రామానికి చెందిన వల్లేపోగు వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో, ఆయన వైద్య చికిత్స నిమిత్తం రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు అండగా నిలవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు.ప్రజలకు వైద్యపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు అర్హత మేరకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చని, అర్హులైన ప్రతి ఒక్కరికీ



ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం చేకూరేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పొట్లపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ మద్దెల సమ్మయ్య, మాజీ సర్పంచ్ తోలేం కళ్యాణి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తోలేం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పక్కనే గోతులు... గ్రామస్తులకు అవస్థలు...!

**- వరి కోతల వేళ ధాన్యం తరలింపునకు ఇబ్బందులు : గ్రామస్తుల ఆందోళన**

**- పెంటన్నగూడెం గ్రామస్తులు, వాహనదారుల ఇబ్బందులు**

**పినపాక, అక్టోబర్ 14 (మనం న్యూస్):** పినపాక మండలం, సీతారాంపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పెంటన్నగూడెం గ్రామంలో ప్రధాన సీసీ రోడ్డుకు ఇరువైపులా గ్రావెల్ లేకపోవడంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో రహదారి పక్కన లోతైన గోతులు ఏర్పడి ప్రమాదకరంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో రహదారి వెంబటి సుమారు మీటరు లోతుతో గోతులు కనిపిస్తున్నాయి అంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.



**- వరి కోతల వేళ మరింత ప్రమాదం...!**

మరో 20 రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామంలోకి ధాన్యం లోడింగ్ కోసం లారీలు రాకపోకలు సాగించనున్నాయి. రహదారి పక్కన గ్రావెల్ లేకపోవడంతో భారీ వాహనాల రాకపోకల సమయంలో సీసీ రోడ్డు అంచులు దెబ్బతిని, రోడ్డు పగుళ్లు ఏర్పడి ముక్కలయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామ సర్పంచ్ సనప అనిత స్పందించి, సీసీ రోడ్డుకు ఇరువైపులా తక్షణమే గ్రావెల్



పోయించి, డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. పంట చేతికొచ్చే సమయంలో రహదారి సమస్య రైతులకు అదనపు ఇబ్బందిగా మారకముందే అధికారులు, గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**- గ్రామ సర్పంచ్ సనప అనిత వివరణ :**

పెంటన్నగూడెం గ్రామంలో రహదారికి ఇరువైపులా గ్రావెల్ లేకపోవడంతో గ్రామస్తులు, వాహన దారులు ఎదుర్కొంటున్న సమస్య మా దృష్టికి వచ్చింది. త్వరలో అధికారుల సహకారంతో గ్రావెల్ పోయించి సమస్య పరిష్కారానికి కచ్చితంగా కృషి చేస్తానని తెలిపారు. ఇవే కాకుండా గ్రామంలో ఇతర సమస్యలను కూడా తన దృష్టికి తీసుకువస్తే సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.



## నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు : ఎంపీడీవో సంకీర్త్

**పినపాక, అక్టోబర్ 14 ( మనం న్యూస్).** గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, ఐటీడీఏ భద్రాచలం ద్వారా వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పినపాక మండల పరిషత్ అభివృద్ధి అధికారి సంకీర్త్ తెలిపారు. ఈ అవకాశాలను అర్హులైన గిరిజన యువత సద్వినియోగం చేసుకునేలా గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెంట్, టైలరింగ్, బ్యూటీ థెరపిస్ట్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, గెస్ట్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్ తదితర కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అవకాశం ఉందన్నారు. కోర్సును బట్టి 18 నుంచి 30 లేదా 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు అర్హులని, విద్యార్హతలు కోర్సును బట్టి పదో తరగతి లేదా ఇంటర్మీడియట్‌గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో అర్హులైన గిరిజన నిరుద్యోగ యువతీ యువకులను గుర్తించి, వాట్సాప్ గ్రూపులు, గ్రామసభలు, ఇతర ప్రచార మాధ్యమాల ద్వారా శిక్షణ కార్యక్రమాల వివరాలను తెలియజేయాలని, ఆసక్తి ఉన్న యువత దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించడంతో పాటు, కోర్సుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు విధానంపై అవసరమైన సమాచారం వారికి



అందించాలని కోరారు. గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ అవకాశాలు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.మరిన్ని వివరాల కోసం 79931 02529, 94413 90232 నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.



## మొక్కలు నాటిన తెల్లం వెంకట్రావు, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ

**భద్రాచలం, అక్టోబర్ 14( మనం న్యూస్):** భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ తో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.




## వి బి జి రామ్ జి పనులను పరిశీలించిన పర్ణశాల గ్రామపంచాయతీ సర్పంచ్. కార్యదర్శి.

**దుమ్ముగూడెం అక్టోబర్ 14 (మనం న్యూస్ ):** స్థలం:పర్ణశాల గ్రామ పంచాయతీ పరిధిలోని గోవిందాపురం గ్రామంలో కొమ్ము చెరువు ఈ బిజీ రాంజీ పథకం ద్వారా చేపడుతున్న చెరువు పూడికతీత పనులను సర్పంచ్ వాగే ఖాదర్ బాబు, కార్యదర్శి సురేష్ లు బుధవారం సందర్శించారు పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం కూలీల హాజరు మస్టర్‌ను తనిఖీ చేసి, పనులు నిబంధనల ప్రకారం నిర్వహించాలని, కూలీలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేపట్టాలని సూచనలు చేశారు. ఎల్ నేను ప్రభావం వల్ల పూర్తిస్థాయిలు పంటలు వేయని కారణంగా వ్యవసాయ కూలి పని తగ్గిందని బిబిజి రాంజీ పథకం ద్వారా చేపట్టే పనులలో పాల్గొని కొంతమేరకైనా ఆర్థిక వెసులుబాటు కల్పించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సవలం భద్రయ్య గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణం పూర్తికాకుండానే ఇళ్లు కేటాయింపు

**– పిచ్చి మొక్కలతో పొదలతో అడవిని తలపిస్తున్న ఇండ్ల సముదాయ ప్రాంతం**

**– అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలు పూర్తిచేయాలని, మౌలిక వసతులు కల్పించాలని అంజుపాక సర్పంచ్ విజ్ఞప్తి**

**– త్వరలోనే ఇండ్లు నిర్మాణాలు పూర్తి చేస్తాము గృహ నిర్మాణ శాఖ ఏఈ**





**దుమ్ముగూడెం అక్టోబర్ 14 (మనం న్యూస్):** పేదవాడి సొంతింటి కల నిజం చేయడం కోసం అంజుబాక గ్రామపంచాయతీలో (కాటాయిగూడెం గ్రామ శివారులో ) నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లబ్ధిదారులైన పేదలకు కేటాయించినా నేటికీ లబ్ధిదారులు ఇళ్లలోకి వెళ్లే పరిస్థితి లేదు. గత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ డబుల్ బెడ్ రూముల నిర్మాణం ప్రారంభించగా ఆ పనులు అసంపూర్తిగానే మిగిలాయి. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ప్లాస్టింగ్ పనులు, ఫ్లోరింగ్ పనులు, కిటికీలు దర్వాజాలు ఏర్పాటు విద్యుత్ వైరింగ్, తదితర పనులు చేపట్టవలసివుంది. దీంతోపాటు డబల్ బెడ్ రూమ్ ల సముదాయానికి విద్యుత్ సౌకర్యం కల్పించడం కోసం విద్యుత్ స్తంభాలు విద్యుత్తు లైను, సిసి రహదారులు, తాగునీటి వసతి కల్పించడం కోసం ట్యాంక్ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాలు కూడా కల్పించవలసింది వుంది. ఈ ఇంటి నిర్మాణాలు చే పట్టిన గత ప్రభుత్వం అధికారం కోల్పోయి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో గత ప్రభుత్వం ప్రారంభించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తికాకుండానే అసంపూర్తిగానే నిలిచిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం అసశీపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి కేటాయించవలసి ఉండగా అవేమీ చేపట్టకుండా అధికారులు హడావుడిగా అంజుపాక గ్రామపంచాయతీలో లబ్ధిదారులు ని ఎంపిక చేసి ఇల్లు కేటాయించి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు కూడా పంపిణీ చేశారు. తమకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు వచ్చిందన్న ఆనందంలో ఉన్న లబ్ధిదారులు తమ ఇల్లు చూసుకుందాం అని ఆ ప్రాంతానికి వెళ్తే మాత్రం చిన్నపాటి అడవిని తలపించే దృశ్యాలే దర్శనమిస్తున్నాయి. ఎక్కడపడితే అక్కడ పిచ్చి మొక్కలు పొదలు చెత్త చెదారంతో ఆ ప్రాంతమంతా నిర్మానుషంగా భయానక వాతావరణంతో నిండి ఉంటుంది. అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాల్ని పూర్తిచేసి లబ్ధిదారులకు కేటాయించి ఉంటే బాగుండేదని ఇప్పుడు పట్టాలు మా చేతికిచ్చినా ఎటువంటి మౌలిక వసతులు కల్పించని డబల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్దకు వెళ్లి కాపురాలు ఉండే పరిస్థితి లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అసంపూర్తిగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పూర్తి చేయాలని ఇక వసతులు కల్పించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి. సర్పంచ్ శాంతమ్మ**



అంజుపాక గ్రామపంచాయతీలు అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ లను లబ్ధిదారులకు కేటాయించి అధికారులు చేతులు దులుపుకుంటే సరిపోదని అసంపూర్తిగావున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని మౌలిక వసతులు కల్పించాలని గ్రామపంచాయతీ సర్పంచ్ శాంతమ్మ ప్రభుత్వం జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. పేదవాడికి ఇల్లు వచ్చిందన్న ఆనందం కన్నా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద ఉన్న పరిస్థితి తీవ్ర ఆందోళన కలిగిస్తుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**త్వరలోనే అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తాం : గృహ నిర్మాణ శాఖ ఏఈ**

అందుపాక గ్రామపంచాయతీకి కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద ఇల్లు అసంపూర్తి నిర్మాణంతో ఉన్న మాట, మౌలిక సదుపాయాలు కల్పించ లేదన్నమాట వాస్తవమేనని గృహ నిర్మాణ శాఖ ఏఈ బిక్షపతి అన్నారు. గతంలో ఆ ఇల్లు నిర్మించిన కాంట్రాక్టర్లు అప్పుడు కుదుర్చుకున్న ఒప్పంద ప్రకారం పని పూర్తి చేయడానికి ముందుకు వస్తే అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులు పూర్తి చేపిస్తామని లేనిపక్షంలో ప్రభుత్వమే నేరుగా లబ్ధిదారులకే నిధులు ఇచ్చి మిగిలిన పనులను పూర్తి చేయించే ఆలోచన చేస్తుందని ఈ విషయంపై ఇంకా ప్రభుత్వ తుది నిర్ణయం తీసుకోవలసి ఉందని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల అనుసారం ముందుకు వెళతామని తెలిపారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



**– తూరు బాకలో విషాదం**

**– రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నేతల డిమాండ్**

**దుమ్ముగూడెం అక్టోబర్ 14 (మనం న్యూస్):** అప్పులు బాధ తాళలేకజరైతు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన దుమ్ముగూడెం మండలం తూరుబాకలో బుధవారం చోటుచేసుకుంది. తూరుబాక గ్రామానికి చెందిన కుమ్మరి కుంట. ముత్యాలరావు ( 63) తన చిన్నతనం నుండి వ్యవసాయం చేసుకుంటూ జీవించే ఓ రైతు. గత కొంతకాలంగా వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగి ఆశించినంత దిగుబడి లేక ప్రతి యాట అప్పులు పెరుగుతూ వచ్చాయి. ఈ ఏడాది కూడా ఐదు ఎకరాలు ప్రతి ఎకరాలు వరి పొలం సాగు చేశాడు. ఎల్ నీనో ప్రభావంతో ఆశించినంత వర్షాలు లేక ఇటు పత్తి పూత మొత్తం ర్యాలీ సరైన వర్షాలు లేక ఎండు దశలో ఉండగా, అటు వరి పొలం కూడా సాగునీరు అందక ఎండిపోతుంది. దీంతోపాటు నాలుగు ఎకరాలు మిర్చి సాగు చేయడానికి ముత్యాలరావు భూమిని సిద్ధం చేశాడు. కానీ తదుపరి వ్యవసాయం చేయడానికి తన వద్ద ఆర్థిక స్తోమత లేక తెచ్చిన అప్పులు కట్టలేక మనస్థాపానికి గురైన ముత్యాలరావు బుధవారం తెల్లవారుజామున కట్టుకునే తెల్ల పంచెను పట్టుకొని తూరుబాక గ్రామ శివారు గోదావరి నదికి ఒడ్డు సమీపంలో ఉన్న తన పొలం వద్దకు వెళ్లాడు. తన పొలానికి సమీపంలో ఉన్న ఓ వేప చెట్టుకి తనతో తెచ్చుకున్న పంచెను ఉరి వేసుకొని బలవన్మరణం కి పాల్పడ్డాడు. ముత్యాలరావు పొలం ఏ గట్టు రైతు దుమ్ముగూడెం సొసైటీ చైర్మన్ కిలిమీ ఎల్లారెడ్డి సుమారుగా ఉదయం 6 గంటల ప్రాంతంలో తన పొలం వద్దకు వెళ్ళగా వేప చెట్టుకు ముత్యాలరావు వేలాడుతూ కనిపించడంతో వెంటనే మాజీ ఎంపిటిసి బొల్లి సూర్యచంద్రరావుకి, బొల్లి సత్యనారాయణ కి సెల్ ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఈ విషయం వారు ఉటావుటిన సంఘటన స్థలానికి చేరుకుని చెట్టుకి వేలాడుతున్న ముత్యాలరావుని కిందకు దించి చూసే లోపే ముత్యాలరావు మరణించినట్లు గుర్తించారు. ఈ విషయం క్షణాలలో తూరుబాక గ్రామంలో దావాణంలో వ్యాపించడంతో ముత్యాలరావు కుటుంబంలో తూరుబాక గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గత కొన్ని సంవత్సరాలగా ముత్యాలరావు ఇటు బ్యాంకు అప్పులు, అటు ప్రైవేటు అప్పులు , వ్యాపారస్తుల వద్ద సుమారుగా 20 లక్షలు అప్పులు ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ అప్పులు ఎలా తీర్చాలి అన్న మనస్థాపనతో ముత్యాలరావు గత కొద్దిరోజులుగా తనలో తాను కుమిలిపోతున్నాడని కానీ ఆ ఇలా బలవన్ మరణానికి పాల్పడతాడని తాము ఊహించలేదని కుటుంబీకులు తెలిపారు. బలవన్ మరణానికి పాల్పడ్డ విషయం దుమ్ముగూడెం సిఐ వెంకటప్ప దృష్టికి తీసుకెళ్లడంతో ఉటావుటిన సంఘటన స్థలానికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దుమ్ముగూడెం పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. మృతునికి నలుగురు కుమార్తెలు ఉండగా నలుగురు కుమార్తెలకు వివాహాలు అయినట్టు తెలిసింది.

**ముత్యాలరావు మృతదేహం వద్ద నివాళులర్పించిన పలు రాజకీయ పార్టీల ప్రముఖులు**

కుమ్మరి కుంట ముత్యాలరావు బలవన్ మరణానికి పాల్పడ్డ విషయాన్ని తెలుసుకున్న సిపిఎం సిపిఐ బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు ప్రముఖులు తూరుబాక గ్రామం చేరుకుని ముత్యాలరావు మృతదేహానికి నివాళులర్పించారు. సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్, రాష్ట్ర జిల్లా నాయకులు ఏజ్ రమేష్ ఎంపీ నర్సారెడ్డి, బ్రహ్మచారి, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజారి సూర్యచంద్రరావు, వీరమాచినేని సునీల్ పరువులు ప్రముఖులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు డిసిసిబి మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా రైతులను ఆదుకునే ప్రయత్నం చేయాలని ఎల్ నీనో ప్రభావంతో పంటలు ఎండిపోయి దిగుబడి రాక అనేకమంది అప్పుల ఊబిలోకి కూరికిపోయారని మండలంలో అందరూ రైతాంగ పరిస్థితి ఇదేనని ప్రభుత్వం రైతుల అప్పులను మాఫీ చేసే విషయంలో స్పష్టమైన వైఖరి ప్రకటించాలని లేనిపక్షంలో ఇలాంటి రైతు బలవన్మరణ సంఘటనలు పునరావృతం అయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# 48వ డివిజన్ గణేష్‌నగర్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు




**ఖమ్మం, అక్టోబర్ 14(మనం న్యూస్) :** నగరంలోని 48వ డివిజన్ గణేష్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ తోట గోవిం దమ్మ-తోట రామారావు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబ రాలు అత్యంత ఉత్సాహంగా వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుక మ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో గణేష్‌నగర్‌లో పండుగ వాతావరణం నెల కొంది. ఈ సందర్భంగా తోట గోవిందమ్మ--తోట రామా రావు మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని పూజించే ఈ పండుగ మహిళల్లో ఐక్యతను, సంతోషాన్ని పెంపొందిస్తుందని అన్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, పూల పండుగ వైభవానికి బతుకమ్మ నిదర్శనమని తెలిపారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృ తి, సంప్రదాయాలను కాపాడుతూ భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేకల అనురాధ, నామ అనిత, కొండిశెట్టి పుణ్యవతి, పున్న అమ ల, గంధసిరి పద్మ, జలగం తిరుపతమ్మ, బీఎస్ఎన్ఎల్ వీరస్వామి, నామా విక్రమ్, శాబాస్ సాయి, అరవింద్, ఓంకారమ్మ,

# పూల జాతరలో 'అట్ల' తీపి..

## ఎర్రగడ్డ పల్లెలో గౌరమ్మ మురిపెం

## ప్రకృతికి, పల్లెతనానికి సర్పంచ్ నల్లమల్ల కీర్తి 'బతుకమ్మ' నీరాజనం

## తిరుమలాయపాలెం మండలం లో కనులపండువగా ఐదో రోజు సంబరాలు



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** తెలంగాణ సంస్కృతికి ఆత్మబంధువు, ప్రకృతి ఆరాధనకు నిలువెత్తు సాక్ష్యం బతుకమ్మ మహోత్సవాలు తిరుమలాయపాలెం మండలంలో సరికొత్త పులకరింతను సంతరించుకున్నాయి. ఐదవ రోజైన బుధవారం ఎర్రగడ్డ గ్రామంలో 'అట్ల బతుకమ్మ' వేడుకలు అత్యంత వైభవంగా, జనరంజకంగా సాగాయి. గ్రామ సర్పంచ్ నల్లమల్ల కీర్తి ప్రత్యేక చొరవ, పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పూల జాతర.. కేవలం ఒక ఆచారంగా కాకుండా, పల్లె ఆత్మను, ఐక్యతను చాటిచెప్పిన అపురూప దృశ్యకావ్యంగా నిలిచింది. పచ్చని చేల గట్ల వెంట కాపలా కాసిన తంగేడు వనాలు నేడు ఎర్రగడ్డ ముంగిట్లోకి తరలివచ్చాయి. ప్రకృతి ప్రసాదించిన గునుగు, చామంతి, గుమ్మడి పూలను అమితమైన ప్రేమతో, అద్భుతమైన గోపురాల్లా పేర్చుతుంటే పల్లె అంతా ఒక పూల సామ్రాజ్యాన్ని తలపించింది. రంగురంగుల సాంప్రదాయ పట్టుచీరల మెరుపులు, ముత్తైదువుల గాజుల గలగలలు పల్లె చౌరస్తాలో నిలిచిన వేళ.. ఏడు రంగుల ఇంద్రధనస్సే ఆకాశం దాటి ఈ నేలపై వాలిందా అన్నట్లుగా భ్రమ కలిగించింది. సర్పంచ్ నల్లమల్ల కీర్తి ఇక్కడ కేవలం ఒక అధికారిక లీడర్‌గా కాకుండా, పల్లె పడుచులా తానే ముందుండి ఈ పూల సైన్యాన్ని నడిపించడం వేడుకకు అసలైన శోభను తెచ్చింది. ఆడబిడ్డలు పోటీపడి బతుకమ్మలను పేర్చిన తీరు, యువతుల నృత్యాల కోలాహలం గ్రామాన్ని ఒక నందనవనంలా సుందరంగా తీర్చిదిద్దాయి. సాయంత్రపు వేళ.. చల్లని గాలి పల్లె తాకిడిని పలకరిస్తుండగా, "అట్ల బతుకమ్మ ఆడి తప్పకుమమ్మ" అంటూ మహిళలంతా ఒకరి చేతిలో ఒకరు చేయి వేసి, లయబద్ధంగా అడుగులు వేస్తుంటే పల్లె ప్రాణం లేచివచ్చింది. ఐదో రోజు విశిష్టతను చాటుతూ.. బియ్యప్పిండి, బెల్లం మేళవించిన కమ్మని అట్లను గౌరమ్మకు నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ కీర్తి స్వయంగా మహిళల నడుమ చేరి, చప్పట్లతో లయబద్ధంగా సాగిన ఆటపాటల్లో లీనమై అందరిలో రెట్టింపు ఉత్సాహాన్ని నింపడం గ్రామస్తులలో సరికొత్త ఆత్మీయ బంధాన్ని పెంచింది.

**చీకటి పడుతున్న వేళ.. ఆకాశంలో బాణసంచా**

వెలుగుల జిలుగులు, చెరువు గట్టున మంగళహారతుల సాక్షిగా బతుకమ్మలను స్థానిక జలాశయంలో ఘనంగా నిమజ్జనం చేశారు. గ్రామ ప్రాచీన వైభవాన్ని, సంస్కృతిని కాపాడుతూ సర్పంచ్ నల్లమల్ల కీర్తి చేసిన ఈ వినూత్న ఏర్పాట్లు మండలంలోనే ఒక సరికొత్త మైలురాయిగా నిలిచిపోయాయి. ఈ అపురూప వేడుకలో గ్రామ ప్రముఖులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

# 16న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

## 33 మంది పూర్వ విద్యార్థులు సన్మాన గ్రహీతలుగా ఎంపిక

## సమ్మేళనంలో ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ పూర్వ విద్యార్థుల సేవకు సత్కారం

**ఖమ్మం, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** ప్రతి ఏటా నిర్వహించే పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో 16విభాగాలలో ప్రతిభ కనబరిచిన పూర్వ విద్యార్థులను సన్మానించి గౌరవించడం ద్వారా కళాశాల గౌరవం ఇనుమడింపజేయాలని ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం నిర్ణయించింది. అనేక రంగాలలో కళాశాల పూర్వ విద్యార్థులు తమ తమ సేవలను సమాజానికి అందించి కళాశాలకు గుర్తింపు తెచ్చారు. సమాజ సేవలో భాగంగా వారు చేసిన సేవలను కార్యవర్గం గుర్తించింది. ఈ ఏడాది ఈ నెల 16న నిర్వహించే రెండవ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనంలో సన్మానంకుగాను కొందరు పూర్వ విద్యార్థి ప్రముఖులను కార్యవర్గం ఎంపిక చేసింది. వీరిని కార్యక్రమంకు హాజరైన సీనియర్ సభ్యులు సత్కరిస్తారు. అనంతరం వారి సందేశాలు ఉంటాయి. ఈఏడాది సన్మానం గ్రహీతలుగా 16 రంగాల నుండి మొత్తం 33 మందిని ఎంపిక చేసినట్లు కార్యవర్గం ప్రకటించింది!

**ఎంపిక చేసిన సన్మాన గ్రహీతలు వీరే ...**



ప్రజాప్రతినిధుల వర్గానికి చెందిన కొండబాల కోటేశ్వరరావు (మదిర మాజీ శాసనసభ్యులు), నల్లగట్ల స్వామిదాస్ (తిరువూరు మాజీ శాసనసభ్యులు), ఉద్యమ నాయకత్వం నుండి గాదె మాధవరెడ్డి (దివాకర్), మహమ్మద్ ముజఫరుద్దీన్, అడ్వకేట్ జహీర్ ఆలీ. శాస్త్రవెత్తల వర్గానికి చెందిన నేదునూరి నర్సింహారావు (సిఇఒ బయోటెక్ కంపెనీ), మద్దినేని మన్మధరావు(రిటైర్ ఇస్రో శాస్త్రవెత్త), విద్యా వెత్తలుగా శివరామయ్య(భీమవరం, డిఇడి కళాశాల ప్రిన్సిపాల్), కనకాచారి(పిజి కళాశాల ఎక్స్ ప్రిన్సిపాల్), ప్రొ.వినుకొండ తిరుమలి (రిటైర్ ప్రొఫెసర్), న్యాయవాద వర్గానికి చెందిన వడ్డెల్లి కృష్ణమూర్తి (సీనియర్ అడ్వకేట్) ,కడారు ప్రభాకరరావు (హైకోర్టు న్యాయవాది), మదార్(రిటైర్ జడ్జి), కళాకారుల వర్గం నుండి యం.పుల్లయ్య( కళాశాల మాజీ కల్చరల్ సెక్రటరీ), గాలి శెట్టి వేణుగోపాల్ (ప్రఖ్యాత కార్టూనిస్ట్), పమ్మిరవి(సాంస్కృతిక సారథి), రచయితల వర్గం నుండి జీవన్(నర్సింహ చారి, రచయిత), మువ్వా.శ్రీనివాసరావు(కవి), పత్రికల వర్గానికి చెందిన కట్టెకోల చిన నరసయ్య( జర్నలిస్ట్ ), భూపాల్ (యన్ టీవి), సామాజిక కార్యకర్తలుగా వెల్లంపల్లి నరేంద్ర స్వరూప్ (బాలకార్మిక వ్యవస్థ), కె.సీతారాములు(రిటైర్ అడిషనల్ యస్పి), దగ్గుల మాధవరెడ్డి(సామాజిక కార్యకర్త), మహిళా సేవా రంగం నుండి కావూరి హిమబిందు (మహిళా సంఘాలు), ధీకొండ చంద్రకళ (కవి), వైద్యరంగం నుండి ఎస్.కె బాబ్జాన్(చెవి,ముక్కు, గొంతు వైద్యులు),వ్యాపార రంగం నుండి వ్యాపారవేత్త కుంచకర్ర నగేష్, క్రీడారంగం నుండి పిల్లి రాజు, సమకాలీన ప్రతిభ కనపరచిన నాళ్ళబానూచందర్, సీనియర్ సిటిజన్ యన్ యస్ సి. బోస్ (రిటైర్ యంఇఓ,ఇల్లెందు),చెల్ది బాబూరావు (రిటైర్ హెడ్మాస్టర్), కార్మిక రంగం నుండి ఆవుల నాగేశ్వరరావు, రైతు వర్గం నుండి మల్లేల సన్మత్ రావులను(నేల పట్ల అగ్రహారం) పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఘనంగా సత్కరించనున్నట్లు కార్యవర్గం తెలిపింది. ఈ సమ్మేళన కార్యక్రమాని కి పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కమిటీ కోరింది

# 21 నుండి 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

## పోలీస్ కమిషనర్

**ఖమ్మం, అక్టోబర్ 14 (మనం న్యూస్) :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు దేశ శాంతిభద్రతలు, ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలను నిర్వహించ నున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు.

**ఓపెన్ హౌస్ కార్యక్రమాలు:**

పోలీస్ స్టేషన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించి పోలీసుల విధులు, ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల రక్షణలో పోలీసుల సేవలు, పోలీసుల ప్రతిభ, త్యాగాలను ప్రజలకు వివరించనున్నారు.

**వ్యాసరచన పోటీలు**

సైబర్ నేరాల నివారణలో పోలీసు పౌరుల పాత్ర

**డ్రగ్స్ నిర్వహణ:** నివారణలో పోలీసుల పాత్ర మరియు విద్యార్థులు డ్రగ్స నుండి ఎలా దురంగా ఉండగలరు

డిగ్రీ మరియు అంతకంటే పై స్థాయి విద్యార్థుల కోసం సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంలో పోలీసుల పాత్ర తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర పోలీస్ సిబ్బందికి రెండు కేటగిరీల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు

**కేటగిరీ--1:** కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ స్థాయి వరకు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు పోలీసుల నుండి ఎటువంటి సేవలను ఆశిస్తారు?

పోలీసు అధికారుల జీవితాల్లో సోషల్ మీడియా పాత్ర మీడియాకు బానిస కాకుండా ఉండటం మరియు వ్యక్తిగత, సామాజిక ప్రయోజనాల కోసం దానిని సద్వినియోగం చేసుకోవడం ఎలా

**కేటగిరీ--2:** ఎస్ఐ మరియు పై స్థాయి అధికారులకు

పౌరుల మన్ననలు పొందటానికి పోలీసులు చేయవలసిన కృషి. క్షేత్రస్థాయి పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం ఈ పోటీలను తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో నిర్వహించనున్నారు. వ్యాసం 500 పదాలకు మించకూడదు. ప్రతిభ కనబరిచిన మొదటి ముగ్గురికి అవార్డులు అందజేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు.

**రక్తదాన శిబిరాలు, సైకిల్ ర్యాలీలు:**

పోలీస్ అమరవీరుల స్మరణార్థం రక్తదాన శిబిరాలు,సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నారు. సైకిల్ ర్యాలీల్లో యువత, విద్యార్థులను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేయనున్నారు.

**అమరవీరుల కుటుంబాల పరామర్శ:**

పోలీస్ అధికారులు అమరవీరుల కుటుంబాల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారిని పరామర్శించి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అమరవీరుల విగ్రహాలు లేదా ఫొటోలు ఉన్న ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ స్థాయి లేదా అంతకంటే పై స్థాయి అధికారులు గ్రామ పెద్దలు,యువత, విద్యార్థుల సమక్షంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నారు.

**షార్ట్ ఫిల్మ్, ఫోటోగ్రఫీ పోటీలు:**

పోలీస్ అమరవీరుల త్యాగాలు,పోలీసుల విధులు,ప్రతిభ, ప్రజల రక్షణ వంటి అంశాలపై యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు షార్ట్ ఫిల్మ్,ఫోటోగ్రఫీ పోటీల్లో పాల్గొనాలని కమిషనర్ కోరారు. పాల్గొనేవారు 3 ఫోటోలు మరియు 3 నిమిషాలకు మించని షార్ట్ ఫిల్మ్ రూపొందించి సమర్పించాలి. ఫోటోలు 10ఐ8 అంగుళాల పరిమాణంలో ఉండా లి. షార్ట్ ఫిల్మ్‌ను పెన్‌డ్రైవ్‌లో పూర్తి వివరాలతో అందజే యాలి. కమిషనరేట్ స్థాయిలో ఎంపికైన మూడు ఉత్తమ షార్ట్ ఫిల్మ్స్,ఫోటోలను రాష్ట్రస్థాయి పోటీల కోసం డీజీపీ కార్యాలయం, హైదరాబాద్‌కు పంపించనున్నారు. ఫోటోలు, షార్ట్ ఫిల్మ్‌లను అక్టోబర్ 23వ తేదీ సాయంత్రంలోగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని పోలీస్ పి ఆర్ వో (8712659256) కార్యాలయంలో అందజేయాలి.

**అక్టోబర్ 21న స్మృతి పరేడ్**

అక్టోబర్ 21న పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా "స్మృతి పరేడ్", "పోలీస్ ఫ్లాగ్ డే" కార్యక్రమాలను పోలీస్ హెడ్ క్వాటర్స్ పరేడ్ గ్రౌండ్స్ లోని స్మారక స్థూపం వద్ద ఘనంగా నిర్వహించి అమరవీరులకు నివాళులు అర్పించనున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు.




# దశదిన కర్మలకు బియ్యం అందజేసిన ఎంపీడీవో శ్రీనివాస్ రావు

**- బాధిత కుటుంబానికి అండగా నిలిచిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి**

**కరకగూడెం, అక్టోబర్ 14(మనం న్యూస్):** తాటిగూడెం గ్రామపంచాయతీలో బహుళ ప్రయోజన ఆరోగ్య కార్యకర్తగా (ఎంపీడబ్ల్యూ) పనిచేస్తున్న దొడ్డి సూర్యం కుమార్తె ఇటీవల అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందడంతో, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. బుధవారం నిర్వహించిన దశదిన కర్మల సందర్భంగా బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. అలాగే కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో అండగా నిలిచారు.బాధిత కుటుంబానికి అండగా నిలిచి, దశదిన కర్మలకు బియ్యం అందజేయడంతో పాటు ఆర్థిక సహాయం చేసిన మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావుకు తాటిగూడెం గ్రామపంచాయతీ పాలకవర్గం, సర్పంచ్ కార్యదర్శి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

# వ్యక్తి మిస్సింగ్...

## పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు..



**ఆళ్ళపల్లి, అక్టోబర్ 14 (మనం న్యూస్):** మండలంలో ఓ యువకుడు కనబడుటలేదని స్థానిక పోలీస్ స్టేషన్లో బుధవారం కేసు నమోదైనట్లు ఎస్సై ఎం. సోమేశ్వర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గుండాల మండలంలోని చీమలగూడెం గ్రామానికి చెందిన కల్తి రేణుక, పాయం భరత్(22) లు ఇటీవల కాలంలో ఆళ్ళపల్లి మండలంలోని తీగలంచ గ్రామం మోకాళ్ళ నరేష్ ఇంటికి ఈనెల 1వ తేదీన రావడం జరిగిందని, ఈ క్రమంలో నే ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి నుండి భరత్ కనిపించడం లేదని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. భరతు ఆచూకీకై సమీప బంధువులు, గ్రామాల్లో అడిగినా ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయడం ఆలస్యమైందని భరతు బంధువు మోకాళ్ళ నరేష్ తెలియజేయడం జరిగిందన్నారు. మోకాళ్ళ నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# ఆపదలో అండగా.. కష్టాల్లో తోడుగా....

## దశదినకర్మలకు ఆర్థిక సహాయం

## లింగగూడెం సర్పంచ్ చింత వెంకటేశ్వర్లు మానవత్వం

**గుండాల,అక్టోబర్ 14(మనం న్యూస్):** గుండాల మండల పరిధిలోని లింగగూడెం గ్రామపంచాయతీలో కుంజ సారమ్మ,స్వర్గీయ వెంకటయ్య దంపతుల చిన్న కుమారుడు కార్తీక్ అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందారు.విషయం తెలుసుకున్న లింగగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ చింత వెంకటేశ్వర్లు,ఆ కుటుంబానికి అండగా నిలిచి, మృతునికి సంతాపం కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. నేడు దశదినకర్మ కార్యక్రమానికి 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయం అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. పదవి అంటే అధికారం కాదని ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడమే నిజమైన నాయకత్వం. కష్టాల్లో ఉన్న పేద కుటుంబానికి చేయూతనిచ్చిన సర్పంచ్ సేవా దృక్పథం అభినందనీయం. ప్రజల కష్టాల్లో తోడుగా నిలిచే నాయకుడే నిజమైన ప్రజా సేవకుడు.పదవి కన్నా మానవత్వం గొప్పదన్నారు.ఈ కార్యక్రంలో ఈసం సాంబయ్య,కల్తీ వసంతరావు,కుంజ సత్యం,ఈసం వీరాస్వామి, మోకాళ్ళ ప్రభాకర్, చీమల దేవన్ బాబు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# 80 వేల అప్పు వివాదమే హత్యకు కారణం..

**- నిందితుడి అరెస్ట్..**

**- బెల్టుతో గొంతు బిగించి యువకుడి హత్య.. : మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి వెల్లడి..**

**కరకగూడెం, అక్టోబర్ 14(మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం కలువల నాగారం గ్రామ శివారులో జరిగిన యువకుడి హత్య కేసును పోలీసులు ఛేదించారు. రూ.80 వేల అప్పు విషయంలో ఏర్పడిన వివాదమే హత్యకు కారణమని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కేసులో నిందితుడు మహమ్మద్ ఇమ్రాన్‌ను బుధవారం అరెస్టు చేసి, న్యాయస్థానం ద్వారా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

**అప్పు విషయంలో ఇద్దరి మధ్య వివాదం.**

డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కలువల నాగారానికి చెందిన బాధావత్ విజయ అక్టోబర్ 12న కరకగూడెం పోలీస్ స్టేషన్‌కు వచ్చి తన కుమారుడు బాధావత్ రవిచంద్రను కరకగూడెంకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్ ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో హత్య చేశాడని ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో మృతుడు రవిచంద్ర నిందితుడు ఇమ్రాన్‌కు రూ.80 వేలు అప్పుగా ఇచ్చినట్లు, ఆ డబ్బుల విషయంలో గత కొంతకాలంగా ఇద్దరి మధ్య వివాదాలు కొనసాగుతున్నట్లు గుర్తించారు.

**పథకం ప్రకారం హత్య చేసినట్లు గుర్తింపు..**

అక్టోబర్ 11వ తేదీ రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో నిందితుడు ఇమ్రాన్ పథకం ప్రకారం రవిచంద్రను తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని కలువల నాగారం గ్రామ శివారుకు



తీసుకెళ్లినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అక్కడ రవిచంద్రపై దాడి చేసి, బెల్టుతో మెడకు బిగించి గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు.

**మోటార్ సైకిల్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం.**

ఈ నెల 14న నిందితుడు మహమ్మద్ ఇమ్రాన్‌ను అతని ఇంటి వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. హత్యకు ఉపయోగించినట్లు భావిస్తున్న ద్విచక్ర వాహనంతో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అరెస్టు చేసిన నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం న్యాయస్థానానికి పంపించినట్లు తెలిపారు.ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ రవీందర్ రెడ్డి వెల్లడించారు. ఈ దర్యాప్తులో ఏడుళ్ళ బయ్యారం సిఐ వెంకటేశ్వం రావు, కరకగూడెం ఎస్ఐ పీవీ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి పనులకు సింగరేణి సీఎస్ఆర్ నిధులు

**రూ.2.44 కోట్లు అందజేత**

**- వైద్య, విద్యా రంగాల అభివృద్ధి, జల సంరక్షణకు ప్రాధాన్యత : కలెక్టర్ అంకిత్**

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 14 (మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పినపాక నియోజకవర్గ పరిధిలో గ్రామీణాభివృద్ధితో పాటు వైద్య, విద్యా రంగాల అభివృద్ధి, జల సంరక్షణకు సంబంధించిన పనుల నిర్వహణ కోసం సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సీసీఎల్) సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులను కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టనున్న అభివృద్ధి పనుల కోసం మొత్తం 4 కోట్ల 93 లక్షల 80 వేల రూపాయలు కేటాయించగా, అందులో 50 శాతం అడ్వాన్సా 2 కోట్ల 44 లక్షల 30 వేల రూపాయలు విలువైన చెక్కును బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్కు సింగరేణి మణుగూరు ఏరియా అధికారులు కలెక్టర్ ఛాంబర్లో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి సింగరేణి సంస్థ అందిస్తున్న సీఎస్ఆర్ నిధులు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు వైద్య, విద్యా రంగాల అభివృద్ధి, జల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పనులు చేపట్టాలని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి సింగరేణి



సంస్థ సహకారం అందించడం అభినందనీయమని తెలిపారు. కేటాయించిన నిధులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సద్వినియోగం చేస్తూ, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. అనంతరం సింగరేణి అధికారులు అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ను ఆయన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి, గ్రామీణాభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రాంచందర్, ఏజీఎం (పర్సనల్) ఎస్. రమేష్, సివిల్ విభాగానికి చెందిన జి. శివప్రసాద్, సి పి ఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించాలి

**ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కు వినతి పత్రం అందజేత**

**వైరా, అక్టోబర్ 14 (మనం న్యూస్):** వైరా పట్టణంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని జర్నలిస్టులు జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌లను కోరారు. వైరా పట్టణంలో అభివృద్ధి పనుల పరిశీలనకు బుధవారం వచ్చిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి జర్నలిస్టులు ఈ సమస్యను తీసుకెళ్లారు.జర్నలిస్టుల విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ప్రెస్ క్లబ్ స్థల కేటాయింపునకు సంబంధించి జర్నలిస్టుల నుంచి దరఖాస్తు తీసుకుని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ సీహెచ్ సురేష్‌బాబును ఆదేశించారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సైతం వెంటనే దరఖాస్తు సమర్పించాలని జర్నలిస్టులకు సూచించారు.దీంతో జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు సమర్పించారు. ఆ దరఖాస్తుపై ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సిఫారసు చేసి తహసీల్దార్‌కు అందజేశారు. ఈ ప్రక్రియను జర్నలిస్టులు నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే సూచించారు. వైరా పట్టణంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ ప్రక్రియను వీలైనంత త్వరగా,



గరిష్ఠంగా దీపావళి నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.జర్నలిస్టులందరి ప్రయోజనాల కోసం ఈ ప్రయత్నం చేపట్టామని, ప్రెస్ క్లబ్ స్థలం, ఇళ్ల స్థలాల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మేడ ప్రసాద్, పారుపల్లి కృష్ణారావు, పులి,కృష్ణార్జునరావు, ఏపూరి రాజారావు , అక్క శెట్టి రవితేజ, నాగరాజుతో పాటు వైస్ చైర్మన్ కట్ల సంతోష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాపా మురళి కృష్ణ ఉన్నారు.